నేడు పరిశ్రమలకు సీఎం భూమిపూజ

● కలెక్టర్ శ్యాంప్రసాద్



పుట్టపర్తి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెనుకొండ, హిందూపురం పారిశ్రామికవాడలలో పరిశ్రమల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం వర్చువల్‌గా భూమిపూజ చేయనున్నట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు ప్రకాశం జిల్లా కనిగిరిలో 30వ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు-2025 ప్రారంభిస్తారన్నారు. ఈ సందర్భంగా అక్కడి నుంచే వర్చువల్‌గా అనేక నూతన పరిశ్రమలకు సంబంధించి భూమి పూజ, ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని పెనుకొండ నియోజకవర్గం అమ్మవారిపల్లి పారిశ్రామిక వాడలో పీహెచ్ఏ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు, హిందూపురం నియోజకవర్గంలోని తూమకుంట పారిశ్రామిక వాడలో హెచ్‌టీఎల్ మెటల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలలో భూమిపూజ కార్యక్రమం నిర్వహిస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా మంత్రి సవిత, ఎంపీ బీకే.పార్థసారథి, ప్రతినిధులు పాల్గొననున్నట్లు తెలిపారు.

భయం..భయం

రైల్వేస్టేషన్‌లో భద్రత కరువు.. పురం స్టేషన్‌లో పట్టపగలే చోరీలు

● ఆందోళన చెందుతున్న ప్రయాణికులు
● ప్లాట్‌ఫాంపై కనిపించని పోలీసులు



హిందూపురం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం

హిందూపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వాణిజ్య కేంద్రంగా పేరుగాంచిన హిందూపురం రైల్వే స్టేషన్‌లో భద్రత డొల్లగా మారింది. తరచూ జరుగుతున్న చోరీలు, దోపిడీలతో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. ఇక్కడ ఉన్న రైల్వే స్టేషన్ అలంకారప్రాయంగా మారిందనే విమర్శలు వినవస్తున్నాయి. పట్టుగూళ్లు, చింతపండు మార్కెట్లు ఉండటం, చేనేత మగ్గాలు వేలాదిగా ఉండటంతో ప్రజలు, వ్యాపారులు ఇక్కడకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అయితే రైల్వే స్టేషన్‌లో భద్రత కొరవడటంతో ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. జరుగుతున్న సంఘటనలతో ప్రయాణికులు ప్లాట్‌ఫాం మీద వేచి ఉండటానికి జంకే పరిస్థితి వచ్చింది. హిందూపురం రైల్వేస్టేషన్ పట్టణం మధ్యలో ఉంటుంది. రైల్వే స్టేషన్‌లో చోరీకి పాల్పడేవారు పోలీసులు అక్కడకు చేరుకునేలోపు ఉడాయిస్తున్నారు. అసలు రైల్వేస్టేషన్‌లో పోలీసులు కనబడటమే గగనం. రైల్వేస్టేషన్‌లో పనిచేసే సిబ్బంది ఏదో చుట్టుపుచూపుగా వచ్చి వెళ్తుంటారనే విమర్శలు ఉన్నాయి. ఇక్కడ పనిచేసే సిబ్బంది ఏ ఒక్కరూ యూనిఫాం ధరించరు. ప్లాట్‌ఫాంపై తిరగరు. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది కొందరు చాలా ఏళ్లుగా పాతుకుపోవడంతో వారికి కొంతమంది అసాంఘిక శక్తులతో సంబంధాలున్నట్లు ఆరోపణలున్నాయి. అందువల్లే దుండగులు పోలీస్‌స్టేషన్ సమీపంలోనే చోరీలకు తెగబడుతున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రైల్వే పోలీస్ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది ఆడిందే ఆట పాడిందేపాటగా తయారైంది.



హిందూపురంలోని రైల్వే పోలీస్‌స్టేషన్

కనిపించని సీసీ కెమెరాలు

హిందూపురం రైల్వే స్టేషన్‌లో ఇప్పటివరకు సీసీకెమెరాలు ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నారు. నత్తనడకన సాగుతున్న ఈ పనులు పూర్తయితే సీసీకెమెరాలు ఏర్పాటు చేస్తామని రైల్వే అధికారులు అంటున్నారు. సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని రైల్వే పోలీసులు పలుమార్లు రైల్వే అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది.

నిత్యం గస్తీ తిరగాలి



హిందూపురం రైల్వే స్టేషన్ నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. అందుకు తగ్గట్టుగా భద్రత లేదు. రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు ఉన్నప్పుడైనా పోలీసులు ప్లాట్‌ఫాంపై యూనిఫాంతో తిరిగితే దొంగలకు కాస్త భయం ఉంటుంది. ఉన్నతాధికారులు స్పందించి ప్రయాణికులకు రక్షణ కల్పించాలి.

- విజయ్‌కుమార్, హిందూపురం

● నాలుగు నెలల కిందట మడకశిర ప్రాంతానికి చెందిన దంపతులు సాయంత్రం ఏడు గంటల సమయంలో హిందూపురం రైల్వే స్టేషన్‌కు వచ్చారు. ఇద్దరు గుర్తుతెలియని దుండగులు వారి వద్దకు వచ్చి రూ.10వేలు నగదును ఎత్తుకెళ్లారు. మహిళ మెడలో బంగారు గొలుసు లాగేందుకు ప్రయత్నించగా భర్త కేకలు వేయడంతో పరారయ్యారు.

● ఈ ఏడాది జూలైలో రాత్రి 12గంటల సమయంలో రైలు దిగి ఆటో కోసం ప్లాట్ ఫాం మీద వేచి ఉన్న చిత్తూరు ప్రాంతానికి చెందిన ఓవ్యక్తిని బెదిరించి బంగారు గొలుసు, రూ.40వేలు గుర్తుతెలియని వ్యక్తులు దోచుకెళ్లారు. ఆయన వ్యాపారి కావడం, పైగా చిత్తూరు జిల్లా కావడంతో ఇక్కడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ప్రయోజనం ఉండదని వెళ్లిపోయాడు.

● సెప్టెంబరులో ఉదయం 5-30ప్రాంతంలో రైలుకోసం పరిగికి చెందిన ఇద్దరు స్నేహితులు ప్లాట్‌ఫాంపై కూర్చుని ఉన్నారు. వారివద్దకు ముగ్గురు గుర్తుతెలియని దుండగులు వచ్చి చేతిలో ఉన్న ఉంగరం, రూ.5వేలు నగదు లాక్కెళ్లారు. బాధితులు కేకలు వేసేలోపే బియ్యం గోదాములవైపు పరుగులు తీశారు.

● రెండ్రోజుల కిందట రైల్వేశాఖలో పనిచేసే ఓ మహిళ 1వ నంబరు ప్లాట్‌ఫాం మీద మధ్యాహ్నం 12గంటల సమయంలో ఉండగా గుర్తుతెలియని దుండగులు వచ్చి మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లారు. ఈ ఘటన రైల్వే పోలీస్‌స్టేషన్‌కు వంద మీటర్ల దూరం ఉండటం గమనార్హం. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇలాంటి చోరీలు, దోపిడీలు హిందూపురం రైల్వేస్టేషన్‌లో తరచూ జరుగుతూనే ఉన్నాయి.

ఇక్కడికి రావాలంటే జంకే



ఇటీవల హిందూపురం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న సంఘటనల వల్ల మహిళలు స్టేషన్‌కు రావడానికి జంకే పరిస్థితి వచ్చింది. పగటిపూటే మెడలోని బంగారు గొలుసులు లాక్కెళ్తున్నారు. ఇక్కడ సీసీకెమెరాలు ఏర్పాటు చేసి, చోరీలను నియంత్రించాలి.

-వేదవతి, హిందూపురం

నిఘా పెంచుతాం

రైల్వే స్టేషన్‌లో భద్రత మరింత కట్టుదిట్టం చేస్తాం. ఉన్న సిబ్బందితోనే చర్యలు తీసుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. సీసీ కెమెరాలు ఉండి ఉంటే కొంతవరకు నేరాలు తగ్గేవి. దొంగలను పట్టుకునేందుకు ఉపయోగపడేవి.

-అశోక్‌కుమార్, రైల్వే సీఐ, ధర్మవరం

ధర్మవరంలో మెగా చేనేత క్లస్టర్

● పుట్టపర్తిలో 2.0 ఎన్టీఆర్ నగర్
● మంత్రి మండలి ఆమోదం

పుట్టపర్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టుకేంద్రం ధర్మవరంలో మెగా చేనేత క్లస్టర్ ఏర్పాటు దిశగా కీలక అడుగు పడింది. చేనేత క్లస్టర్‌కు భూ కేటాయింపులకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో సోమవారం 35వ మంత్రివర్గం సమావేశం జరిగింది. జిల్లాకు సంబంధించి సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ధర్మవరం మార్కెట్ యార్డు ప్రాంగణంలో చేనేత మెగా క్లస్టర్ ఏర్పాటుకు సర్వే నంబర్ 65లో 9.84 ఎకరాల భూమిని కేటాయించారు. నెలకు రూ.10 వేలు అద్దె చెల్లించేలా 25 ఏళ్లపాటు చేనేత, జౌళి శాఖకు ఈ భూమిని కేటాయించే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 కింద ఎన్టీఆర్ నగర్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. దీని కోసం పుట్టపర్తి మండలం నిడిమామిడి గ్రామంలో 100 ఎకరాల భూమిని ఏపీ టీడ్కో మేనేజింగ్ డైరెక్టర్‌కు ఎకరం రూ.1,89,1769 ప్రకారం కేటాయించారు. ఈ మొత్తాన్ని 2025-26 నుంచి 2029-30 వరకు ఐదు వార్షిక వాయిదాల్లో చెల్లించే వెసులుబాటు కల్పించారు.

చేనేతల సంబరాలు



మంత్రి చాంబర్‌లో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న ధర్మవరం చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకులు

ధర్మవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులు ఎన్నో ఏళ్లగా ఎదురుచూస్తున్న మెగా చేనేత క్లస్టర్ ఆమోదంపై ధర్మవరం చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకులు సోమవారం సంబరాలు చేసుకున్నారు. విజయవాడలో మంత్రి సత్యకుమార్ యాదవ్ చాంబర్‌లో కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మెగా హ్యాండ్‌లూమ్ క్లస్టర్‌కు భూమి కేటాయింపునకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం సంతోషకరమన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి సత్యకుమార్ యాదవ్‌లకు మార్కెట్‌యార్డ్ ఛైర్‌పర్సన్ అంబటి అరుణశ్రీ, చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకులు సంధారాఘవ, జింకా పురుషోత్తం, నాగూర్‌హుస్సేన్, షేక్‌చంద్ర, కొత్తపేట ఆది, కేశగాళ్ల శీన, సాయికృష్ణ, బీజేపీ నాయకులు అంబటి సనత్, సాకే ఓబులేసు, ఆదినారాయణయాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ.. హ్యాండ్‌లూమ్ క్లస్టర్‌కు భూమి కేటాయింపు చారిత్మాత్మకమన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చేనేత పునరుజ్జీవానికి దోహదం చేస్తుందన్నారు. క్లస్టర్ స్థాపనతో వేలాది చేనేత కార్మికులకు ఉపాధి లభిస్తుందన్నారు.

హౌస్‌ఫుల్



పుట్టపర్తి పట్టణం

● రూములకు అడ్వాన్స్ బుకింగ్, లాడ్జులు ఫుల్ ● సత్యసాయి జయంతి వేళ గదులకు డిమాండ్

పుట్టపర్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శతజయంతి వేడుకలకు లక్షలాది మంది భక్తులు రానుండటంతో పుట్టపర్తిలో లాడ్జిలు, అద్దె గదులకు డిమాండ్ భారీగా పెరిగింది. గత దశాబ్ద కాలంగా ఏమాత్రం ఆదరణ లేని లాడ్జిలు సైతం బాబా జయంతిని పురస్కరించుకుని ఫుల్ అవుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. బాబా జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వము, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేపట్టాయి. సదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు పుట్టపర్తిలో ముందస్తుగా రూములకు బుక్ చేసుకుంటున్నారు. ఇప్పటికే చాలా లాడ్జిలలో రూములు పూర్తిగా బుక్ అయిపోయాయి.

100 లాడ్జులు.. 2500 రూములు..

పట్టణంలో దాదాపు 100 వరకు లాడ్జులు ఉన్నాయి. వీటిలో 2500 వరకు రూములు ఉంటాయి. గతంలో జయంతి వేడుకల్లో కొద్ది రోజులు మాత్రమే రూములు పూర్తిస్థాయిలో భక్తులతో నిండి ఉండేవి. నవంబరు 22 లేదా 23 తేదీల్లో మాత్రమే రూములు పూర్తిస్థాయిలో నిండేవి. ఎక్కువ మంది భక్తులు ఆ రెండు రోజులు మాత్రమే పుట్టపర్తికి వచ్చేవారు. అయితే ఈ ఏడు సత్యసాయి శతజయంతి వేడుకలు జరుగుతుండటం ప్రత్యేకతను సంతరించుకుంది. దీంతో వేడుకలకు తిలకించాలని ఎక్కువ మంది భక్తులు ఆసక్తి చూపడంతో రూములకు డిమాండ్ పెరిగింది. గతంలో తరచూ పుట్టపర్తికి వచ్చే భక్తులు ఫోన్ల ద్వారా ఆయా లాడ్జుల యజమానులకు సమాచారం అందించి రూములను కోరుతున్నారు. ప్రశాంతి గ్రామం వద్ద దాదాపు 50 లాడ్జులు ఉన్నాయి. వీటిలో 500 రూముల వరకు అందుబాటు ఉన్నాయి. వీటిలో ఎక్కువ భాగం హాస్పిటల్‌కి వచ్చే పేషెంట్లు నివాసం ఉండేవారు. అయితే ఈ ఏడు శతజయంతి వేడుకలకు వచ్చే భక్తులు హాస్పిటల్ వద్ద సైతం రూములకు బుక్ చేసుకున్నట్లు సమాచారం.

లక్షల్లో భక్తులు.. వేలలో రూములు..

సత్యసాయి శతజయంతి వేడుకలకు లక్షల్లో భక్తులు వస్తారన్న అంచనాలు ఉన్నాయి. దాదాపు 120 దేశాల నుంచి భక్తులు సత్యసాయి శతజయంతి వేడుకలకు హాజరుకానున్నారు. మన రాష్ట్రం నుంచే లక్ష మందిపైగా భక్తులు వస్తారని అంచనాలు ఉన్నాయి. వీరందరికీ గదులో వసతి కల్పించడం కష్టం. అందుకే వేలల్లో ఉన్న రూములకు డిమాండ్ పెరిగింది. ముఖ్యంగా నవంబరులో తుఫానులు వచ్చే అవకాశం ఉండటం, వర్షం వస్తే చిత్తడిగా ఉండి, చలిగాలులకు ఇబ్బంది పడతామన్న ఉద్దేశ్యంతో అనేక మంది అడ్వాన్స్ పేమెంట్ కట్టి రూములను రిజర్వ్ చేసుకుంటున్నారు. దీంతో రూములకు డిమాండ్ పెరిగింది.

ఫీజు చెల్లింపు తేదీల ప్రకటన

కొత్తచెరువు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు తేదీలను ప్రభుత్వం సోమవారం ప్రకటించినట్లు జిల్లా ప్రభుత్వ పరీక్షల విభాగపు అధికారి లాజర్ తెలిపారు. ఈ నెల 13 నుంచి 25వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించ వచ్చునన్నారు. ఈ నెల 26 నుంచి డిసెంబరు 3 వరకు రూ.50లు, నాలుగో తేదీ నుంచి 10వరకు రూ.200లు, 11 నుంచి 15 తేదీ వరకు రూ.500 అపరాధ రుసుముతో ఫీజు చెల్లించవచ్చన్నారు. రెగ్యులర్ విద్యార్థులు మొత్తం సబ్జెక్టులకు రూ.125లు,



ఒకేషనల్ విద్యార్థులు అదనంగా రూ.60లు చెలించాల్సి ఉంటుందన్నారు. ఏజ్డ్ అభ్యర్థులు రూ.300లు చెల్లించాలని ఆయన తెలిపారు. పరీక్ష ఫీజు ఆయా పాఠశాల లాగిన్‌లో హెచ్‌టీటీపీఎస్//బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చెల్లించాలన్నారు.

అర్జీలపై అలసత్వం వద్దు: జేసీ

పుట్టపర్తి టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యల పరిష్కారం కోసం ఎన్నో వ్యయప్రయాసలకోర్చి, జిల్లా కేంద్రానికి వచ్చి ప్రజలు ఇచ్చిన అర్జీల పట్ల అలసత్వం వహించరాదని జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జేసీ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈకార్యక్రమానికి మొత్తం 251 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి వారు సంతృప్తి చెందే విధంగా పరిష్కారం చూపాలన్నారు. భూసమస్యలు, రేషన్ కార్డులు, ఇంటిపట్టాల మంజూరు, పెన్షన్ల మంజూరు తదితర అంశాలతో కూడిన వినతులు అధికంగా ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్, డీసీఓ కృష్ణ పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ మౌర్య భరద్వాజ్

తెలుగు పరిరక్షణలో సీపీ బ్రౌన్ కృషి అమూల్యం

తెలుగుభాష, సాహిత్య పరిరక్షణ, అభివృద్ధికి సీపీ బ్రౌన్ చేసిన కృషి అమూల్యమైనదని జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కొనియాడారు. కలెక్టరేట్‌లో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సీపీబ్రౌన్ 227వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ సీపీబ్రౌన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ తెలుగుభాషను అభివృద్ధి దిశగా తీసుకెళ్లడంలో ప్రతి ఒక్కరూ ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు.

కుష్ఠుపై అపోహలు తొలగించండి

కుష్ఠు వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించడంతో పాటు బాధితులను గుర్తించి చికిత్స అందించాలని జేసీ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కుష్ఠు బాధితులను గుర్తించే కార్యక్రమంపై సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈనెల 17 నుంచి 30 తేదీ వరకు వైద్యఆరోగ్య శాఖ అధికారులు ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టాలన్నారు. కుష్ఠు లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరిని గుర్తించి వైద్య సౌకర్యాలు అందించాలన్నారు. జిల్లాలోని ప్రతి వ్యక్తికి కుష్ఠువ్యాధి పరీక్షలు చేయాలని ఆదేశించారు. అనంతరం కుష్ఠు నిర్మూలన ప్రచార పోస్టర్లను జేసీ ఆవిష్కరించారు. సమావేశంలో డీఆర్వో సూర్యనారాయణ రెడ్డి, డీఅండ్‌హెచ్ఓ ఫైరోజ్ బేగం, జిల్లా కుష్ఠు నివారణ అధికారిణి డాక్టర్ అనుపమ తదితరులు పాల్గొన్నారు.

మాధవ్.. నోరు అదుపులో పెట్టుకో!

ఎంపీ బీకే ఫైర్



పెనుకొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మాధవ్..! నోరు అదుపులోకి పెట్టుకుని మాట్లాడు. లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది అని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి మండిపడ్డారు. పెనుకొండ ఎస్సీ కాలనీలో సోమవారం ఆయన బీకే విలేకరులతో మాట్లాడుతూ కళ్యాణదుర్గంలో భక్త కనకదాస విగ్రహ ప్రతిష్ఠ మంత్రి లోకేశ్ సమక్షంలో వైభవంగా జరగడాన్ని చూసి ఓర్వలేకనే వైసీపీ మాజీ ఎంపీ నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్డీఏ ప్రభుత్వ పాలనలో కురుబలకు రక్షణ లేకుండా పోయిందని, హత్య రాజకీయాలు చేస్తున్నారని మాట్లాడుతున్న మాధవ్ కురుబ కులంలో పుట్టిన చీడపురుగు అన్నారు. కులాన్ని అడ్డుపెట్టుకుని పదవులు పొందిన మాజీ మంత్రులు శంకర్‌నారాయణ, ఉషశ్రీ చరణ్ అధికారంలో ఉన్నప్పుడు కురుబ కులస్థులకు ఏం చేశారో చెప్పాలన్నారు. హత్యా రాజకీయాలు ఎవరి పాలనలో జరిగాయో చిన్న పిల్లల్ని అడిగినా చెబుతారన్నారు. నిజా నిజాలు తెలుసుకుని మాట్లాడితే మంచిదని లేదంటే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

సత్వర న్యాయం చేయండి: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సతీష్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వివిధ ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సత్వరమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చట్టపరిధిలో ఫిర్యాదులను పరిష్కరిస్తామన్న భరోసాను ఫిర్యాదుదారులకు ఎస్పీ కల్పించారు. ఫిర్యాదుదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, దివ్యాంగులు, మహిళలు, వృద్ధుల ఫిర్యాదులను ప్రథమ ప్రాధాన్యంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కుటుంబ కలహాలు, భూసమస్యలు, భార్యాభర్తల గొడవలు, సైబర్‌నేరాలు, వంటివాటిపై 66 ఫిర్యాదులందాయి. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, ఎస్బీ సీఐ వెంకటేశ్వర్లు, డీసీఆర్బీ సీఐలు శ్రీనివాసులు, ఇస్మాయిల్, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదిదారులతో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్



బాక్సులు మాయం..!

● బస్సుల్లో కనిపించని ఫస్ట్ ఎయిడ్ బాక్సులు
● నిర్వహణను వదిలేసిన ఆర్టీసీ

● వివరాలు 6వ పేజీలో..

పోలీస్ అలర్ట్

ఢిల్లీలో పేలుళ్ల నేపథ్యంలో

ముమ్మర తనిఖీలు

- బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లలో పెరిగిన నిఘా
- అనంతలో గట్టి భద్రత



అనంతపురం విద్యుత్ నగర్ సర్కిల్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ శ్రీకాంత్



గుత్తి రైల్వే స్టేషన్‌లో రాత్రి 11.30 సమయంలో కాచిగూడ-పుదుచ్చేరి రైలు దిగిన ప్రయాణికులను తనిఖీ చేస్తున్న ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది



గుత్తి పట్టణంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు



అనంత బస్టాండ్ సమీపంలో త్రీ టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తనిఖీలు



బొమ్మనహాళ్ పోలీస్ స్టేషన్ వద్ద వాహనాల తనిఖీ

బీసీ రుణం అయోమయం..!

రుణ యూనిట్లు మంజూరైనా విడుదల కాని నిధులు

పూలే జయంతి రోజున ఆర్భాటంగా చెక్ విడుదల.. నెలలు గడుస్తున్నా.. అందని రుణాలు

- లబ్ధిదారులకు తప్పని ఎదురుచూపులు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ
- యంత్రాంగం మౌనం..

అనంతపురం విద్య, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. యూనిట్లు మంజూరు చేసి నెలలు గడిచినా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదు. జిల్లా యంత్రాంగం మాత్రం పూలే జయంతి రోజున చెక్కు విడుదల చేసి.. హంగామా చేసింది. నేటికీ సబ్సిడీ రుణాలు అందక లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. నిధులు ఎప్పుడు విడుదలవుతాయోనని చెప్పేవారు కూడా కరువయ్యారు.



రుణాలకు సంబంధించిన చెక్‌ను విడుదల చేస్తున్న అప్పటి కలెక్టర్ వినోద్‌కుమార్

వైసీపీ హయాంలో నిర్వీర్యం

బీసీ కార్పొరేషన్‌లో బడుగు, బలహీనవర్గాల వారితో పాటు ఆర్థికంగా బలహీనంగా ఉన్న ఓసీలకు ప్రభుత్వం తరఫున వివిధ రకాల రుణాలు మంజూరు చేస్తారు. గత వైసీపీ సర్కారు ఇలాంటి కార్పొరేషన్లను నిర్వీర్యం చేసింది. చైర్మెన్‌ను నియమించి, వారికి కనీస సౌకర్యాలు కల్పించిన పాపాన పోలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేషన్ల ద్వారా పేదోళ్లకు పథకాలు మంజూరు చేసి ఆదుకోవాలని భావించింది. అందులో భాగంగా అనంత జిల్లాలో బీసీ కార్పొరేషన్ ద్వారా వేలాది మందికి బ్యాంకు రుణాలను సబ్సిడీపై మంజూరు చేయాలని చర్యలు చేపడుతోంది. జిల్లా యంత్రాంగం సైతం ఆయావర్గాల నుంచి దరఖాస్తులు స్వీకరించి, యూనిట్లు మంజూరు చేసింది.



బీసీ కార్పొరేషన్ కార్యాలయం

ఆర్భాటంగా చెక్ విడుదల

జిల్లాలో బీసీ కార్పొరేషన్ ద్వారా మొత్తం 2,429 రుణ యూనిట్లు మంజూరు చేశారు. ఇందుకోసం 50శాతం సబ్సిడీతో రూ.52.31 కోట్లు కేటాయించారు. ఇందులో ప్రభుత్వం రూ26.15 కోట్లు ఇస్తే.. బ్యాంకులు అంతే మొత్తంలో రుణాలు మంజూరు చేయాల్సి ఉంటుంది. ఇంతవరకు ఈ యూనిట్లకు డబ్బు మంజూరు కాలేదు.

జనరిక్ మందుల షాపులు.. కుట్టుమిషన్లూ అంతే..

ఈబీసీ కార్పొరేషన్ కింద జిల్లాలో వివిధ వర్గాలకు కలిపి 72 జనరిక్ మందులషాపులను మంజూరు చేశారు. ఇందుకోసం రూ5.76 కోట్లు ఇవ్వాల్సి ఉంది. ఇందులో సగం సొమ్ము ప్రభుత్వం ఇస్తే మిగిలిన సగం బ్యాంకులు రుణాల రూపంలో మంజూరు చేస్తాయి. వీటికి పైసా కూడా రాలేదు. అలాగే జిల్లాలో 4,083 మంది మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇచ్చారు. వీరందరికీ కుట్టుమిషన్లను బీసీ కార్పొరేషన్ ద్వారా అందించాల్సి ఉంది. ఇప్పటికీ ఒక్క కుట్టుమిషన్ కూడా రాలేదు. చివరకు కుట్టుశిక్షణ ఇచ్చిన సంస్థలకు అందుకు సంబంధించిన బిల్లులు కూడా చెల్లించలేదు. దీంతో ఆయావర్గాలకు ఎదురుచూపులు తప్పలేదు.

అధికారుల అత్యుత్సాహం

బీసీ కార్పొరేషన్ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదు. ఈ ఏడాది పూలే జయంతి రోజున అప్పటి కలెక్టర్ వినోద్‌కుమార్, ప్రజాప్రతినిధులు చెక్ విడుదల చేశారు. ఇప్పటికీ అందుకు సంబంధించిన నిధులు ప్రభుత్వం నుంచి విడుదల కాలేదు. దీంతో లబ్ధిదారులు.. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వారికి ఏం చెప్పాలో అర్థంకాక యంత్రాంగం తలలు పట్టుకుంటోంది.

జిల్లాలో బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రుణ యూనిట్లు

పేరు	యూనిట్లు	సబ్సిడీ(రూ.)	బ్యాంకులోను(రూ.)	విలువ(రూ.)
బీసీ కార్పొరేషన్	1,728	16.45కోట్లు	16.45కోట్లు	32.90కోట్లు
ఈబీసీ	102	88.50లక్షలు	88.50లక్షలు	1.77కోట్లు
కమ్మ	58	50.50లక్షలు	50.50లక్షలు	1.01కోట్లు
రెడ్డి	29	25లక్షలు	25లక్షలు	50లక్షలు
వైశ్య	21	18లక్షలు	18లక్షలు	36లక్షలు
బ్రాహ్మణ	14	12లక్షలు	12లక్షలు	24లక్షలు
క్షత్రియ	1	లక్ష	లక్ష	2లక్షలు
కాపు	344	5.77కోట్లు	5.77కోట్లు	11.55కోట్లు
మేదర, కుమ్మర	132	1.98కోట్లు	1.98కోట్లు	3.96కోట్లు
మొత్తం యూనిట్లు	2,429	26.15కోట్లు	2,615కోట్లు	52.31కోట్లు

ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉంది



కొత్తగా ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్నా. కార్పొరేషన్ రుణాలకు సంబంధించిన నిధులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. అవి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమవుతాయి. కుట్టుమిషన్ల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసికెళ్తాం.

-రామసుబ్బారెడ్డి, బీసీ కార్పొరేషన్ ఈడీ

మీ ఆయన నా జేబులో ఉన్నాడా ?

బాధితురాలిపై ఎస్ఐ హూంకరింపు

న్యాయం కోసం ఎస్పీ కార్యాలయానికి బాధితులు

అనంతపురం క్రైం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 'ఏంటి..! మీ ఆయన నా జేబులో ఉన్నాడా? తెచ్చి ఇవ్వడానికి' ఇదీ ఓ బాధితురాలు స్టేషన్‌కు వెళితే ఎస్ఐ నుంచి వచ్చిన హూంకరింపుతో కూడిన సమాధానం. ఇలా కొందరు పోలీస్ అధికారులు బెదిరింపు ధోరణిలో సమాధానం ఇస్తుంటే... మరికొందరు దివ్యాంగులు అనే కనికరం కూడా చూపడం లేదు. దీంతో స్థానిక స్టేషన్లలో తమకు న్యాయం జరగదని భావించిన పలువురు ఎస్పీ కార్యాలయం మెట్లు ఎక్కుతున్నారు. జిల్లా కేంద్రంలో ఎస్పీ నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు సోమవారం జిల్లాలోని పలుప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. తర్వాత పలువురు మీడియాతో తమ ఆవేదన వ్యక్తం చేశారు.



మూడు నెలలుగా తిరుగుతున్నా

మూడు నెలలుగా తిరుగుతున్నా గార్లదిన్నె ఎస్ఐ తనకు న్యాయం చేయడంలేదంటూ సంజీవపురానికి చెందిన బాధితురాలు బొగ్గు మంజుల వాపోయారు. తన భర్త భాస్కర్ మూడు నెలల కిందట ఓ అమ్మాయితో వెళ్లిపోయాడని తెలిపారు. ఈ సమస్యపై అడిగేందుకు గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌కు గత మూడు నెలలుగా తిరుగుతున్నానని వాపోయారు. ఎస్ఐ ఏమాత్రం స్పందించడం లేదని, పైగా మీ ఆయన నా జేబులో ఉన్నాడా అంటూ తిడుతున్నాడని ఆమె వాపోయారు. ఎంపీటీసీ విశ్వనాథ్, ఓ అమ్మాయి కుటుంబ సభ్యులతో డబ్బులు తీసుకుని వాళ్లకు అనుకూలంగా మాట్లాడుతున్నారంటూ ఆరోపించారు. తనకు న్యాయం జరిగేలా చూడాలని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

నా సెల్‌ఫోన్ ఎప్పుడు దొరుకుతుందో?



ఇతడి పేరు ఓబులేసు. తాడిపత్రి ప్రాంతంలోని ఏడిగడ్డపాళెంలోని బంకమట్టి వీధిలో నివాసం ఉంటున్నాడు. పక్షవాతం వచ్చింది. ఒక చెయ్యి పనిచేయదు. పక్షవాతం కావడం వల్ల మూతి సొట్టపోయింది. దీంతో మాట్లాడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. తాడిపత్రిలో గత నెల 6న ఆటోలో రూ. 10 వేల విలువైన సెల్‌ఫోన్ పోయిందని తెలిపారు. ఫోన్ పోయిన తర్వాత రోజే తాను తాడిపత్రి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. అయితే 'సెల్‌ఫోన్ దొరికితే చెప్పి పంపుతాం అని పోలీసులు అంటున్నారు. ఎప్పుడు దొరుకుతుందో ఏమో ' అని ఆయన వాపోయాడు.

కంప్లైంట్ ఇస్తే నరికేస్తాం అంటున్నారు..



భూ వివాదంలో తనపై కొడవలితో దాడి చేసిన వారిపై కేసు పెట్టాలని ఐదు సార్లు స్టేషన్‌కు వెళ్లినా న్యాయం జరగలేదని మైలారంపల్లికి చెందిన గంగమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డే తిరులేసు, ఆయన భార్య కవిత నా పొలంలోనే మామిడి చెట్లు నాటారు. ఆ ఇద్దరితోపాటు శంకరయ్య, సునీత, లక్ష్మీదేవి కలిసి నా మీద దాడి చేశారంటూ వాపోయారు. పైగా కంప్లైంట్ ఇస్తే నరికేస్తామంటూ బెదిరిస్తున్నారని ఆమె గగ్గోలు పెట్టారు. వారిపై ఉరవకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు వాళ్లను స్టేషన్‌లోకి పిలిచి మాట్లాడతారు. తనను మాత్రం స్టేషన్ దగ్గర కూర్చోబెట్టి వెనక్కు పంపుతారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

గొర్రెలు, మేకలకు ఆంత్రాక్స్ వ్యాక్సిన్లు

- పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్

అనంతపురం అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో గొర్రెలకు ఆంత్రాక్స్ వ్యాక్సిన్లు వేశామని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రేమ్‌చంద్ పేర్కొన్నారు. జిల్లాలోని బొమ్మనహాల్, ఆత్మకూరు, కూడేరు, విడపనకల్లు, తాడిపత్రి మండలాల్లో గొర్రెలు, మేకలు ఆకస్మికంగా మృతి చెందాయన్నారు. ఈ పరిణామంతో ఆంత్రాక్స్ సోకిందన్న అనుమానంతో జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం అధికారులు, సిబ్బంది ద్వారా తక్షణమే రక్తనమూనాలు సేకరించామని తెలిపారు. ఆంత్రాక్స్ వ్యాధి బ్యాక్టీరియాను మైక్రో స్కోప్ ద్వారా పరిశీలించి, వ్యాధి సోకినట్లు నిర్ధారించామని వివరించారు. ఆ సమాచారాన్ని సంబంధిత పశు వైద్యాధికారులకు అందజేసి, వ్యాధి సోకిన ప్రాంతాల్లో 5 కిలో మీటర్లలోపు ఉన్న గొర్రెలు, మేకల సంఖ్యను తెలుసుకొని వాటికి వ్యాక్సిన్లు వేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. వ్యాధి సోకిన ప్రాంతంలోని గొర్రెలు, మేకల కళేబరాలను జాగ్రత్తగా పూడ్చివేసి, మిగిలిన జీవాలకు సోకకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. ఆంత్రాక్స్ వ్యాధి నిర్ధారణ అయిన మండలాల్లో మిగిలిన ఆరోగ్యకరమైన గొర్రెలు, మేకలకు 35,470 డోస్‌లు వేయించామని తెలిపారు. మరో లక్ష డోసులు సిద్ధంగా ఉంచామని పేర్కొన్నారు.

రేపు అనంతలో ప్రజా ఉద్యమం

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 12వతేదీ అనంతపురంలో ప్రజా ఉద్యమం పేరుతో నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10గంటలకు నగరంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమై టవర్‌క్లాక్, లలిత కళాపరిషత్ మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం ఆర్డీఓకు వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ప్రజలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కూలీలకు అవగాహన కల్పించండి

- వీసీలో కలెక్టర్ ఆనంద్

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులకు ఎక్కువ మంది కూలీలు వచ్చేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో పలు అంశాలపై ఆయా శాఖల అధికారులు, ఆర్డీఓలు, ఎస్డీసీలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జేసీ శివ్‌నారాయణ్‌శర్మతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....ఉపాధి హామీ పథకం కింద జిల్లాలోని 569 గ్రామ పంచాయతీల పరిధిలో ప్రస్తుతం డైలీ లేబర్ టర్నవుట్ కింద 17,800 మంది పనులకు వస్తున్నారన్నారు. ప్రతి మండలం నుంచి మరింత ఎక్కువ మంది కూలీలు ఉపాధి పనులకు వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి పనుల కింద కేటాయించిన లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. జిల్లాలో ఉపాధి పని జరగని గ్రామ పంచాయతీలు ఉండరాదన్నారు. ఉపాధి పనుల్లో విడపనకల్లు మండలం వెనుకబడి ఉందని, ప్రతి రోజు అవగాహన కల్పించి పనుల్లో పురోగతి తీసుకురావాలని ఆదేశించారు. 90రోజుల హౌసింగ్‌లో మరింత పురోగతి తీసుకురావాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. మాజీ సైనికులకు ఆయా మండలాల్లో భూమి పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వీసీలో కేఆర్‌ఆర్‌సీ ఎస్డీసీ తిప్పేనాయక్, సీపీఓ అశోక్‌కుమార్, హౌసింగ్ పీడీ శైలజ, డ్వామా పీడీ సలీమ్‌బాషా, డీపీఓ నాగరాజు నాయుడు, జడ్పీ సీఈఓ శివశంకర్, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కైలాసనాథ అలంకరణలో బుగ్గ రామలింగేశ్వరుడు

తాడిపత్రి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు కైలాసనాథ అలంకరణలో దర్శనమిచ్చారు. కార్తీకమాసం మూడోవారం కావడంతో భక్తులు స్వామి దర్శనానికి పోటెత్తారు. ఓం నమఃశివాయ అంటూ భక్తుల నామస్మరణతో ఆలయ పరిసర ప్రాంతాలు మారుమ్రోగాయి. సాయంత్రం మహిళలు పెద్దఎత్తున దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు.



కైలాసనాథుడిగా స్వామి

గుత్తి మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం కోయంబత్తూరు-మదార్ (వయా గుత్తి) ప్రత్యేక వీక్లీ రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కోయంబత్తూరు-మదార్ ప్రత్యేక రైలు (నం. 06181) ఈ నెల 13, 20, 27, డిసెంబరు 4 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 06182) ఈ నెల 16, 23, 30, డిసెంబరు 7 తేదీల్లో నడపనున్నట్లు వెల్లడించారు. ఈ రైలు తిరుప్పూర్, ఈరోడ్, సేలం, జోలార్‌పట్టి, కాట్పాడి, రేణిగుంట, కడప, యర్రగుంట్ల, గుత్తి, డోన్, కర్నూలు సిటీ, గద్వాల, మహబూబ్‌నగర్, కాచిగూడ, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ముద్‌ఖేడ్, నాందేడ్, పూర్ణా, హింగోళి డెక్కన్, వాసిం, అకోలా, మల్కాపూర్, భుసవల్, జల్‌గావ్, పల్ది, నాదుర్బార్, ఎడ్నా, సూరత్, భరుచ్, వడోదర, గోద్రా, రత్లం, జవోరా, మండ్‌సోర్, నీమచ్, చత్తీస్‌ఘర్, భిల్వారా, బిజయ్‌నగర్, నాసిరాబాద్, అజ్మీర్ స్టేషన్ల మీదుగా వెళ్తుందని పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.17 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి):అనంత వ్యవసాయ మార్కెట్లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.13వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 19టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

బాక్సులు మాయం..!

- బస్సుల్లో కనిపించని ఫస్ట్ ఎయిడ్ బాక్సులు
- నిర్వహణను వదిలేసిన ఆర్టీసీ



ఆర్టీసీ బస్సులో ఖాళీగా ఫస్ట్ ఎయిడ్ బాక్స్

ధర్మవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితమని చాలా మంది ప్రయాణికులు భావిస్తున్నారు. బస్సుల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి సారించడం లేదు. బస్సులు ప్రమాదానికి గురైతే ప్రయాణికులకు కనీసం ప్రథమ చికిత్స కూడా లభించడం లేదు. దగ్గరలోని ఆసుపత్రికి రక్తమోడుతూ వెళ్లాల్సిందే. తాత్కాలిక ఉపశమనంగా ఆర్టీసీ బస్సుల్లో గతంలో ప్రథమ చికిత్స పెట్టెల్లో మందులు అందుబాటులో ఉండేవి. వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీని పూర్తిగా నిర్వీర్యం చేయడంతో ప్రయాణికుల భద్రత గాలికి వదిలేసినట్లయింది. రాష్ట్రంలో వరుసగా ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలోనయినా అధికారులు మేల్కోకపోవడం గమనార్హం. జిల్లాలో ఆర్టీసీ బస్సుల రాకపోకలు పెరుగుతున్నాయి. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో మరింత రద్దీ పెరిగింది. బస్సుల వసతులపై అధికారులతో సమీక్షించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు లేవనే చెప్పవచ్చు. చాలా బస్సుల్లో మెడికల్ కిట్లు లేవు. ఉన్నా.. చాలా వరకు కాలం చెల్లిన మందులే ఉన్నాయని ప్రయాణికులు అంటున్నారు. అసలు హైదరాబాద్ సర్వీసులోనే ఫస్ట్ ఎయిడ్ బాక్స్ కనిపించలేదు.



జిల్లాలో పరిస్థితి ఇదీ..

- ఆర్టీసీ డిపోలు : ఆరు
- మొత్తం బస్సులు : 391 బస్సులు
- అద్దె బస్సులు : 119
- పల్లె వెలుగు బస్సులు : 196
- అల్ట్రా పల్లె వెలుగు బస్సులు : 14
- ఎక్స్‌ప్రెస్ బస్సులు :119
- రోజు తిరిగే కిలోమీటర్లు 1.48 లక్షలు
- రోజు జిల్లాలో ప్రయాణించే ప్రయాణికులు : 1.34 లక్షలు
- ప్రతి రోజూ వచ్చే ఆదాయం: రూ.66.89 లక్షలు

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..

మోటారు వాహనాల చట్టం ప్రకారం ఆర్టీసీ, విద్యాసంస్థల బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు తప్పని సరిగా ఏర్పాటు చేయాలి. ఇందులో దూది, కత్తెర, టించర్, అయోడిన్, యాంటిసెప్టిక్ క్రీం, కాటన్ బ్యాండేజీ, వాటర్ ప్రూఫ్ ప్లాస్టర్ వంటివి ఉండాలి. ఆర్టీసీ బస్సుల్లో డ్రైవర్ సీటు వెనకాల ఈ ప్రథమ చికిత్స పెట్టె ఉండాలి. ఏదైనా ప్రమాదం జరిగితే ఆ పెట్టెలో ఉన్న సామాగ్రితో కండక్టర్ ప్రథమ చికిత్స చేయాలి. జిల్లాలోని బస్సుల్లో చాలా వరకు ప్రథమ చికిత్స పెట్టెలు కనుమరుగయ్యాయి. కొన్ని బస్సుల్లో పెట్టెలున్నా మందులు ఉండటంలేదు. అందులో డ్రైవర్లకు సంబంధించిన సామగ్రి లేదా కండక్టర్లు టికెట్ రోల్స్ పెట్టుకుంటున్నారు.

బాక్సులే కనిపించలేదు



కొన్ని ఆర్టీసీ బస్సుల్లో అసలు ఫస్ట్ ఎయిడ్ బాక్సులే కనిపించలేదు. కొన్ని బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఉన్నా అందులో ఏమీ ఉండవు. పేపర్లు, దూది మాత్రమే కనిపిస్తాయి. ఉచిత బస్సు ప్రయాణం వచ్చాక చాలా మంది వృద్ధులు, నడవలేనివారు ఎక్కి, దిగే సందర్భాల్లో గాయపడుతుంటారు. కానీ ఎవరికీ మందులు వేయడం లేదు, కట్లు కట్టడంలేదు. దీనిపై ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

- బాలయ్య, తాడిపత్రి

ప్రతి బస్సులో ఏర్పాటు చేస్తాం

చాలా బస్సుల్లో ఫస్ట్‌ఎయిడ్ కిట్లులేవన్నది వాస్తవమే. ప్రతి బస్సుకు ఫస్ట్ ఎయిడ్ కిట్లను ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందజేస్తున్నాం. ప్రస్తుతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న తరుణంలో డ్రైవర్లకు రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా డ్రైవింగ్‌పై ప్రత్యేక సూచనలు తెలియజేస్తున్నాం. ప్రతి రోజూ డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నాం.

-మధుసూదన్, ఆర్ఎం, ఆర్టీసీ



హైదరాబాద్ సర్వీసులో కూడా కనిపించని ఫస్ట్ ఎయిడ్‌బాక్స్

ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఉంచాలి



ఆర్టీసీ బస్సుల్లోని ఫస్ట్ ఎయిడ్ బాక్సులో మెడికల్ కిట్లను ఉంచాలి. అసలే ప్రస్తుతం ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంది. ఈ క్రమంలో బస్సు ఎక్కే సమయంలో తోపులాటలో రక్తగాయాలయినప్పుడు లేదా బస్సు దిగే సమయంలో డోర్ నుంచి జారి పడినప్పుడు గాయాలయ్యే అవకాశం ఉంది. ఈ సమయంలో బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఉంటే కట్టుకట్టి ప్రథమ చికిత్స చేయించుకోవచ్చు. ఆర్టీసీ అధికారులు బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లను ఏర్పాటు చేయాలి. -చంద్ర, ముదిగుబ్బ

క్రైం కార్నర్

కూలీల ఆటోను ఢీకొట్టిన లారీ

● 14 మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం



క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న టీడీపీ అధికార ప్రతినిధి శ్రీధర్‌బాబు

బుక్కరాయసముద్రం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామం వద్ద ఆదివారం రాత్రి ఆటోను లారీ ఢీ కొనడంతో 14 మంది కూలీలు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు, బాధితులు తెలిపిన మేరకు.. కొర్రపాడు ఎస్సీ కాలనీకి చెందిన గృహ నిర్మాణ కూలీలు అనంతపురం పట్టణంలో ఆదివారం సాయంత్రం ఓ ఇంటి నిర్మాణం పనికి వెళ్లారు. పని ముగించు కుని ఆటోలో ఇంటికి బయల్దేరారు. తాడిపత్రి వైపు నుంచి అతి వేగంగా వస్తున్న లారీ రెడ్డిపల్లి వద్ద ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న పవన్, లక్ష్మన్న వెంకటేశు, లక్ష్మీనారాయణ, కాంచన, రామరాజు, గోపాల్, శ్రావణి, లక్ష్మిదేవి, రోగోడు, జానకితో పాటు మరి కొందరు గాయపడ్డారు. వీరిలో పవన్, లక్ష్మన్న పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. ప్రమాదం విషయం తెలుసుకున్న జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్ బాబు అనంతపురం సర్వజన అస్పత్రిలో చికిత్సపొందుతున్న వారిని పరామర్శించారు. పరిస్థితి విషమంగా ఉన్న వారికి ఆర్థిక సాయం చేశారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సంఘటనపై ఆరాతీసి పరిస్థితి విషమంగా ఉన్నవారిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాలని సూచించారు. వారి చికిత్స కోసం అయ్యే ఖర్చు తానే భరిస్తానని తెలిపారు. ఈ ఘటనపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి



రమేష్ (ఫైల్)

హిందూపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తూమకుంట పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమ వద్ద విద్యుదాఘాతంతో సచివాలయ లైన్‌మన్ రమేష్(35) మృతిచెందాడు. ఎల్‌సీ తీసుకుని విద్యుత్ లైన్‌కు మరమ్మతులు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. విద్యుత్ సరఫరా కావడంతో మృతిచెందాడా, లేక పరిశ్రమలో ఉన్న జనరేటర్ విద్యుత్ రివర్స్ రావడంతో మృతిచెందాడా అన్న విషయం తెలియాల్సి ఉందని అప్‌గ్రేడ్ పోలీసులు అన్నారు. మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రమేష్‌కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. పారిశ్రామికవాడకు ప్రత్యేకంగా లైన్‌మన్ ఉంటారు. కానీ సచివాలయ లైన్‌మన్ చేత పరిశ్రమలో మరమ్మతులు ఎందుకు చేయించాల్సి వచ్చిందో తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో టీచర్లకు గాయాలు

ఉరవకొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపిడి సమీపంలో ద్విచక్రవాహనం బోల్తా పడి ఇద్దరు ఉపాధ్యాయులు గాయపడ్డారు. ఇంద్రావతి, మోపిడి పాఠశాలలో పని చేస్తున్న రవి, రామన్న అనే ఉపాధ్యాయులు ఎస్‌ఏ-1 ప్రశ్నాపత్రాల కోసం ఆమిద్యాలకు ద్విచక్రవాహనంపై వెళ్లి, తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. కుక్క అడ్డం రావడంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి, బోల్తా పడింది. దీంతో ఇద్దరికీ గాయాలు అయ్యాయి. వారిని 108లో ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మూడు కిలోల గంజాయి స్వాధీనం

● 14 మంది అరెస్ట్



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ

ముదిగుబ్బ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయించే ముఠా సభ్యులు, సేవించే వారు మొత్తం 14 మందిని అరెస్ట్ చేసినట్లు ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్ వెల్లడించారు. సోమవారం ముదిగుబ్బ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో సీఐ శివరాముడుతో కలిసి డీఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. ముదిగుబ్బ సీఐ శివరాముడు ఆధ్వర్యంలో గంజాయి వ్యాపారం చేస్తున్న ఆరుగురు వ్యక్తులు, సేవించే ఆరుగురు వ్యక్తులు, మరో ఇద్దరు మైనర్లను ముదిగుబ్బ గ్రామ శివారులోని రైల్వే ట్రాక్ పక్కన అరెస్ట్ చేశారని తెలిపారు. వారి నుంచి మూడు కిలోల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరందరిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్‌ఐ భువనేశ్వరి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

షెక్షావలి కుటుంబాన్ని ఆదుకుంటాం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



పాడె మోస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

బెళుగుప్ప, నవంబరు10(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో మృతి చెందిన టీడీపీ దూదేకుల సాధికార కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్, రిటైర్డ్ ఎస్పీ పి. షెక్షావలి(66) కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పేర్కొన్నారు. షెక్షావలి ఆదివారం రాత్రి తన స్వగ్రామం శ్రీ రంగాపురంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో వెంకటశివుడు యాదవ్ ఆయన గ్రామానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతదేహంపై టీడీపీ జెండా కప్పి, పాడె మోశారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, టీడీపీ నాయకులు పెద్ద తిప్పయ్య, ఉమర్ ముక్తార్, పామిడి మాజీ మున్సిపల్ చైర్మన్ గౌస్ పీర, దూదేకుల సంఘం అధ్యక్షుడు మస్తాన్ వలి, దూదేకుల సంఘం నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

6న ఉచిత కృత్రిమ అవయవాల అమరిక

బెంగళూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 'భగవాన్ మహావీర్ జైన్ వికలాంగ్ సహాయ సమితి' ఏటా బెంగళూరులో ఉచితంగా కృత్రిమ అవయవాల అమరిక శిబిరం నిర్వహిస్తోంది. అందులో భాగంగానే రానున్న డిసెంబరు 6వతేదీ శనివారం బెంగళూరు నగరం జయనగర్ పరిధిలోని అశోక్‌పిల్లర్ సమీపాన ఉండే మహావీర్ అగ్రసేన్ భవన్‌లో శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా శిబిరం కొనసాగుతుందన్నారు. కృత్రిమంగా ఎటువంటి అవయవాలు అవసరమైనా వారికి అవసరమైన కొలతల ప్రకారం సమకూరుస్తామమని నిర్వాహకులు తెలిపారు. శిబిరం బెంగళూరులో నిర్వహించినా సమీపంలోని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల పరిధికి చెందినవారు పాల్గొనవచ్చునన్నారు. కృత్రిమ అవయవాలు అమరిక ప్రక్రియ పూర్తిగా ఉచితమని ఎవరూ ఎటువంటి సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. సాధ్యమైనంత త్వరగా శిబిరానికి చేరుకోవడం ద్వారా ముందుగా పరికరాలు పొందే వెసలుబాటు ఉందన్నారు. ఎటువంటి సందేహాలు, సలహాలకైనా సందీప్ పొడ్డార్ 8792288404 రింకేష్ బరోలియా 9886521885ను సంప్రదించవచ్చని వారు ప్రకటనలో తెలిపారు.

రైల్వే సమస్యలను పరిష్కరించండి

● డీఆర్‌ఎంను కలిసిన ఎంపీ అంబికా, ఎమ్మెల్యే గుమ్మనూరు



డీఆర్‌ఎంతో చర్చిస్తున్న ఎంపీ అంబికా, ఎమ్మెల్యే గుమ్మనూరు

గుంతకల్లు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్ పరిధిలోని గుంతకల్లు, అనంతపురం తదితర ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలపై ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం స్థానిక డీఆర్‌ఎం సీఎస్ గుప్తాతో చర్చించారు. సోమవారం డీఆర్‌ఎం కార్యాలయానికి వెళ్లిన ఎంపీ, ఎమ్మెల్యే డివిజనల్ రైల్వే మేనేజరు చంద్రశేఖర్ గుప్తాతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కసాపురం రోడ్డులోని రైలు వంతెనను వెడల్పు చేయాలని, ధర్మవరం గేటు వద్ద ఆర్‌యూబీ నిర్మాణానికి ఉన్న ప్రతిబంధకాలను తొలగించి టెండరును పిలవాలని, రోటరీ పాఠశాల వద్ద రైల్వే లైన్‌ను దాటడానికి ఆర్‌యూబీ లేదా ఫుట్ ఓవర్ వంతెనను ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణంలోని మదినాబాద్ వద్ద రైల్వే స్టేషన్‌లోకి వెళ్లడానికి ర్యాంప్‌ను ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారి, మున్సిపాలిటీ పరిధిలో రైల్వే లైన్లపై వంతెనలను నిర్మించాలని తెలిపారు. కల్లూరు ఆర్‌టీబీ వద్ద వర్షపు నీరు నిలుస్తోందని, వర్షపు నీరు పడకుండా షెల్టర్‌ను నిర్మించాలని, అనంతపురంలోని రాంనగర్, ప్రసన్నాయపల్లి, మారుతీనగర్‌లో ఆర్‌యూబీలకు సంబంధించి డీపీఆర్‌లను తయారు చేయాలని కోరారు. గుంతకల్లు-మైసూరు ప్యాసింజరు రైలును ఏర్పాటు చేయాలని, అనంతపురంలో రాజధాని, తదితర ఎక్స్‌ప్రెస్‌లను నిలపాలని, అలాగే గుత్తి, రాయలచెరువు స్టేషన్లలో కొన్ని రైళ్లను నిలపాలని ప్రతిపాదించారు. డీఆర్‌ఎంతో భేటీ అయినవారిలో మున్సిపల్ కమిషనరు నయ్యూం అహ్మద్, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, కోడెల చంద్రశేఖర్, పత్తి హిమబిందు, సురేశ్ నాయుడు, అభిషేక్, తలారి మస్తానప్ప ఉన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడి ప్రతిభ



ఆయూబ్‌ఖాన్

వజ్రకరూరు(ఉరవకొండ), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయడుగా పనిచేస్తున్న ఆయూబ్‌ఖాన్ ఏషియన్ మాస్టర్ అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మాస్టర్ అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకూ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 22 ఆసియా దేశాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఆయూబ్‌ఖాన్ ఇండియా తరఫున 50ప్లస్ పురుషుల విభాగంలో 3 కిలో మీటర్ల స్టీపుల్ చెస్‌లో పాల్గొని 5వ స్థానం దక్కించుకున్నారు. ఆయనను వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, నరసింహారెడ్డి అభినందించారు.

జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపిక



విద్యార్థి రాఖీని అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ, టీచర్లు

పామిడి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి. కొండాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జె. రాఖీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు వెంకటలక్ష్మి, పీడీ మల్లికార్జున సోమవారం తెలిపారు. ఇటీవల విజయవాడలో జరిగిన అండర్-17 రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో విశేష ప్రతిభను కనపరచి బంగారు పథకం సాధించారన్నారు. త్వరలో ఉత్తర ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి కుస్తీ పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థి రాఖీని ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు గుత్తి విద్యార్థినులు..



విద్యార్థినులను అభినందిస్తున్నహెచ్‌ఎం, టీచర్లు

గుత్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సుంకన్న తెలిపారు. ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన 69వ క్రీడా పోటీల్లో 9వ తరగతి చదువుతున్న మంజుల రాష్ట్ర స్థాయి పోటీలో గోల్డ్ మెడల్ సాధించింది. ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి క్రీడాపోటీలకు పాల్గొంటుందని తెలిపారు. లలిత అనే విద్యార్థిని వెండి పతకం సాధించింది. జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం తరఫున పాల్గొంటారన్నారు. సోమవారం విద్యార్థినులను హెచ్‌ఎంతో పాటు పీడీలు సరోజ, శ్యామల, లోకేశ్వరి అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు ప్రవీణ్..



డీ. హీరేహాళ్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో మండలంలోని సోమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ప్రవీణ్ ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. సోమలాపురంలో అతని తల్లిదండ్రులు మారేష్, సావిత్రి వ్యవసాయ కూలీలు. మారుమూల గ్రామానికి చెందిన ప్రవీణ్ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై ఆ గ్రామస్థులు అతని తల్లిదండ్రులను అభినందించారు.

జిల్లా తైక్వాండో క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో కోచ్‌లు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా తైక్వాండో క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన జిల్లా స్థాయి తైక్వాండో క్రీడాకారుల జాబితాను ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు శాంతరాజ్, రామాంజి ప్రకటించారు. సబ్‌జూనియర్ బాలురలో సత్యబ్రూస్‌లీ, గగన కృష్ణరాజులు, రీయాన్ష్, అవినాష్, చిత్ర త్రివిక్రమ్, హరి దీక్షిత్‌రెడ్డి, అనుదీప్, రిత్విక్, మోక్షదర్ రెడ్డి, అరుణ్, షాకీర్, జైన్‌రెడ్డి, అలెగ్జాండర్, భరత్, గోకుల్ కృష్ణ, శ్రీరామ్, రణ్‌ధీర్‌రెడ్డి, వశీష్, హితేష్‌రానా ఎంపికయ్యారు. బాలికల్లో దీక్షిక, నందిక, మహాలక్ష్మి, అర్షియా, అస్పియా ఇమాని, అక్షయ, చైత్ర, తేజస్వి, నిషిత, మహా, మోక్షిక, శ్రీవెన్నెల, నిర్మల, మయాన్షి, ఉమామహేశ్వరి, కీర్తి, వసీఫా, లాస్య, లలిత, సాహిత్య, కీర్తిప్రియ, చేతన, మైత్రి, దర్శిని, భావ్యదీపా, లక్ష్య సాగర్, దీక్ష ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 14వతేదీ నుంచి కాకినాడలో జరిగే 39వ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు తులసి వెంకటేష్, శ్రీకాంత్, యోగానంద, ప్రదీప్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

14న తుంగభద్ర నీటిపారుదల

సలహా కమిటీ సమావేశం

బళ్లారి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నీటిపారుదల సలహా కమిటీ సమావేశం ఈ నెల 14న బెంగళూరులో జరగనుందని కమిటీ అధ్యక్షుడు శివరాజ్ తంగడిగె సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుంగభద్ర జలాశయంలో నీటి లభ్యత, ప్రస్తుతం డ్యాంలో నీటి నిల్వ, తుంగభద్ర డ్యాం నుంచి రబీకి నీరు వదిలేది, లేనిది నూతన క్రస్ట్ గేట్ల ఏర్పాటుపై సమావేశంలో చర్చిస్తామన్నారు. సమావేశం బెంగళూరులోని విధానసౌధ 3వ అంతస్తులోని జలమండలి కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జలవనరుల శాఖ మంత్రి, డీసీఎం డీకే శివకుమార్, నీటిపారుదల సలహా కమిటీ అధ్యక్షుడు శివరాజ్ తంగడగి, ఇంజనీర్లు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారని వారు తెలిపారు.

13న జాబ్ మేళా

అనంతపురం అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతకు సీల్ హెచ్‌ఆర్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్‌లో ఉద్యోగాల కోసం ఈనెల 13న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి పల్లవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం కోర్టు రోడ్డులోని జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో ఈనెల 13న ఉదయం 10.30 గంటలకు జాబ్ మేళా ఉంటుందన్నారు. సీల్ హెచ్‌ఆర్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్‌లో అనంత, శ్రీసత్యసాయి జిల్లాలో అసిస్టెంట్ సేల్స్‌మెన్‌గా పనిచేసేందుకు పదోతరగతి, ఆపైన విద్యార్హత కలిగి, 18 నుంచి 30 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న యువత అర్హులన్నారు. ఔత్సాహికులు బయోడేటాతోపాటు విద్యార్హతలకు సంబంధించి ఒరిజినల్, జిరాక్స్ ప్రతులు, ఆధార్, బ్యాంక్ అకౌంట్, పాన్ కార్డులను తీసుకుని హాజరు కావాలన్నారు.

పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాల విలీనం

● పైలెట్ ప్రాజెక్టులుగా మడకశిర, కళ్యాణదుర్గం ఎంపిక

మడకశిర రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలల్లో విలీనం చేస్తున్నట్లు ఎంఈఓ భాస్కర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సత్యసాయి జిల్లాలోని మడకశిర, అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం మండలాలను పైలెట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేసినట్లు వివరించారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు.. మడకశిర మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పిల్లల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రూడ్‌సెట్‌లో ఈనెల 22వతేదీ నుంచి ఉచితంగా మహిళలకు బ్యూటీ పార్లర్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. 18-45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి రేషన్, ఆధార్‌కార్డు కలిగిన ఉమ్మడి జిల్లా నిరుద్యోగ మహిళలు అర్హులని పేర్కొన్నారు. 30 రోజులపాటు సాగే శిక్షణా కాలంలో భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఎస్కేయూ సమీపంలోని రూడ్‌సెట్ సంస్థ కార్యాలయలో నేరుగా లేదా సెల్ నంబరు 9618876060ను సంప్రదించాలని కోరారు.

అమరావతి నుంచి కార్యకలాపాలు

● ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చైర్మన్ ప్రమోద్‌కుమార్ రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు10(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల విలీనం తరువాత రాజధాని అమరావతిలో ఏర్పాటు చేసిన ప్రధాన కార్యాలయం నుంచి కార్యకలాపాలు ప్రారంభించామని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చైర్మన్ ప్రమోద్‌కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లాకు వచ్చిన ఆయనతోపాటు జనరల్ మేనేజర్లు స్థానిక కేఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మొక్కలు నాటారు. అనంతరం జడ్పీ హాలులో ఏర్పాటు చేసిన మేనేజర్ల సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ.. రైతులు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. సాంకేతికంగా ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడే పరిష్కరించి ఖాతాదారులను సంతృప్తి పరచాలని సూచించారు. ఇటీవల జరిగిన బ్యాంకుల విలీనం తరువాత రాజధాని అమరావతి నుంచి ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేసి... కార్యకలాపాలు సాగిస్తున్నామని తెలిపారు. అనంతరం రుణ గ్రహీతలకు వాహనాలు అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ శ్రీదేవి, కాలేజీ ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ వేణుగోపాల్, బ్యాంకు చీఫ్ మేనేజర్లు, సీనియర్ మేనేజర్లు, బ్రాంచ్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



కేఎస్‌ఆర్ కళాశాలలో మొక్క నాటుతున్న చైర్మన్ ప్రమోద్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

కుష్ఠ వ్యాధి గుర్తింపులో భాగస్వాములవ్వాలి

● అధికారులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశం

అనంతపురం వైద్యం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కుష్ఠ వ్యాధి నివారణలో భాగంగా చేపట్టిన వ్యాధి నిర్ధారణ కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల అధికారులందరూ భాగస్వాములవ్వాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కుష్ఠ వ్యాధి నివారణపై సోమవారం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికెళ్లి ప్రతి వ్యక్తికి కుష్ఠ వ్యాధి పరీక్షలు నిర్వహించాలని, వ్యాధిసోకిన వారిని గుర్తించి తగిన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రాథమిక దశలో గుర్తించి వైద్యం అందిస్తే ఆరు నెలల్లో నయమవుతుందని తెలిపారు. ఈనెల 17నుంచి 30వరకు వైద్యాధికారులు ఇంటింటికెళ్లి సర్వేచేయాలని ఆదేశించారు. పాఠశాలలు, సంక్షేమశాఖ వసతి గృహాల విద్యార్థులకు పరీక్షలు చేయాలని పేర్కొన్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జయలక్ష్మి, డీఎన్‌ఎంఓ డాక్టర్ గంగాధర్‌రెడ్డి, పీఎంఓ నాగన్న, డీపీఎంఓ రామదాసు, ప్రసాద్‌తో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు.

గోరంట్లలో రామరాయల శాసనం



రామరాయల శాసనం గురించి వివరిస్తున్న చరిత్రకారుడు మైనాస్వామి

గోరంట్ల, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవరాయ ఆలయంలో విజయనగర రాజ్యానికి చెందిన రామరాయలు 1559 వేయించిన శాసనాన్ని గుర్తించినట్లు చరిత్రకారుడు మైనాస్వామి సోమవారం తెలిపారు. ఆలయం ముఖమండపం దక్షిణద్వారం పక్కన 9అడుగుల పొడవు, మూడున్నర అడుగు వెడల్పు గల పెద్ద తెలుగు దాన శాసనాన్ని గుర్తించినట్లు చెప్పారు. మాధవరాయ ఆలయంలో నిత్యపూజలు, కైంకర్యాలు జరగడం కోసం రామరాయలు శక సంవత్సరం 1481 అంటే ఆంగ్ల సంవత్సరం 1559 జూన్‌లో గోరంట్ల పరిసరాల్లోని భూములను దానం చేసినట్లు శాసనంలో పొందుపరిచారని వివరించారు. శాసనం పైభాగాన ఆంజనేయస్వామి శిల్పం నమస్కార ముద్రలో ఉత్తరంగా ఉంది. విజయనగరాన్ని (నేటి హంపి) విద్యానగరంగా, గోరంట్లను మాత్రం గోరంట్ల అని శాసనంలో స్పష్టంగా రాశారని మైనాస్వామి తెలిపారు.

పలువురికి డైరెక్టర్ పదవులు



మైనార్టీ కమిషన్ డైరెక్టర్ షఫీవుల్లా



ఉప్పర సగర కార్పొరేషన్ డైరెక్టర్‌గా మణిప్రియ

పుట్టపర్తి రూరల్/హిందూపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్లకు డైరక్టర్లను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. సత్యసాయి జిల్లాకు చెందిన మరో ముగ్గురికి అవకాశం కల్పించింది. ఇందులో ఆంధ్రప్రదేశ్ మైనార్టీ కార్పొరేషన్ డైరక్టరుగా హిందూపురానికి చెందిన షఫీవుల్లాను (టీడీపీ), ఆంధ్రప్రదేశ్ లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టరుగా పుట్టపర్తికి చెందిన దాడెం నారపరెడ్డి (టీడీపీ), ఆంధ్రప్రదేశ్ సగర/ఉప్పర వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరక్టరుగా హిందూపురానికి చెందిన దలవటం మణిప్రియ (జనసేన)ను నియమించింది. ఆర్‌ఎంఎస్ షఫీవుల్లాను టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, నాయకులు వెంకటేష్, అమర్నాథ్, అన్వర్ అభినందించారు. మణిప్రియను జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకుల ఉమేష్ అభినందించారు.



ఆర్‌ఎంఎస్ షఫీని సన్మానిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు, నాయకులు

ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఆనంద్‌రాజ్



కణేకల్లు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన యు. ఆనంద్‌రాజ్ రాష్ట్ర సగర/ఉప్పర వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందినట్లు ఆనంద్‌రాజ్ తెలిపారు. తనను డైరెక్టర్‌గా ఎంపిక చేసినందుకు విప్ కాలవ శ్రీనివాసులు, ప్రభుత్వానికి ఆనంద్‌రాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

న్యూస్ బాక్స్

కార్తీక సోమవారం పూజలు


ముదిగుబ్బ భవానీ శంకరుడు

ముదిగుబ్బ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని గణేశ హరిహర దేవాల యంలో కార్తీక మాస మూడో సోమవారం సందర్భంగా భవానీ శంకర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రఘునాథ శాస్త్రి భవానీ శంకర స్వామి లింగానికి అభిషేకాలు చేసి, అర్ధనారీశ్వర అలంకరణ చేశారు.

● బత్తలపల్లి: మండలవ్యాప్తంగా సోమవారం శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. కార్తీక మాసం మూడో సోమవారం కావడంతో సంఘమేశ్వర ఆలయం ఓంకారేశ్వర ఆలయం, ముస్టూ శివాలయం, అనంతసాగరం రామలింగేశ్వర అలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దీపాలు వెలిగించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: ఆర్టీఓ

కదిరి అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని ఆర్టీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయన సోమవారం స్థానిక ఆర్టీఓ కార్యాలయ ఆవరణలో స్కూళ్ల బస్సుల డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. రోడ్డు భద్రతా ప్రమాణాలను తప్పక పాటించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంవీఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పప్పూరు రామాచార్యులు జయంతి

బుక్కపట్నం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో సోమవారం స్వాతంత్ర్య సమర యోధుడు పప్పూరు రామాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పప్పూరు రామాచార్యులును స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు దేశం కోసం, సమాజం కోసం తమ వంతు అంకితంకావాలని పిలుపునిచ్చారు. పప్పూరు రామాచార్యుల స్మారక కమిటీ ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలిక అప్పగింత

నల్లమాడ, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న ఓ బాలిక ఆదివారం రాత్రి పాఠశాల నుంచి అదృశ్యమైంది. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేసిన మేరకు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. రాత్రి పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు వెతికినా దొరక లేదు. ఆ బాలిక తన అక్క స్నేహితురాలి ఇంటికి వెళ్లినట్లు తెలుసుకున్నారు. సోమవారం బాలిక తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది, పోలీసులు అక్కడికెళ్లి బాలికను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అక్కడనుంచి అనంతపురంలోని చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించినట్లు సీఐ నరేంద్రరెడ్డి తెలిపారు. ఈ విషయంపై పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా ఆదివారం రాత్రి భోజన సమయంలో గేట్‌లో ఉన్న వాచ్‌మ్యాన్ నీటిని వదలడానికి మోటార్ ఆన్ చేయడానికి వెళ్లాడని, ఆసమయంలో బాలిక బయటకు వెళ్లియినట్లు తెలిపారు.

కంపచెట్ల తొలగింపు

అమడగూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని జౌకలకొత్తపల్లి, మహమ్మదాబాద్ పంచాయతీలలో విద్యుత్ అంతరాయం, కరెంట్ కోతలు ఎక్కువగా ఉండేవి. దీనిపై పలుమార్లు ఆ పంచాయతీ ప్రజలు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆ శాఖ ఏఈ చంద్రనాయక్ సోమవారం సొంత ఖర్చుతో ఎక్స్‌కవేటర్‌ను ఓబులదేవరచెరువు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నుంచి మహమ్మదాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు 33కేవీ లైన్ కింద ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగించారు. ఆయా గ్రామాల్లో 11 కేవీ లైన్ కింద ఉన్న కంపచెట్లను కూడా తొలగించి విద్యుత్ సమస్యలు లేకుండా చూస్తామని ఏఈ తెలిపారు.

స్ప్రింక్లర్లు, పైపుల చోరీ

గాండ్లపెంట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తూపల్లిలో ఉన్న తన పొలంలో స్ప్రింక్లర్లు, పైపులు చోరీ అయినట్లు రైతు అల్లాబకాష్ సోమవారం తెలిపారు. తూపల్లిలోని తన పొలంలో వ్యవసాయ బోరు కింద సాగుచేసిన వేరుశనగకు నీరందించేందుకు స్ప్రింక్లర్లు ఏర్పాటుచేశానని తెలిపాడు. ఆదివారం రాత్రి తన పొలంలో ఉన్న 16 పైపులు, ఏడు స్ప్రింక్లర్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని వాపోయాడు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

కుక్కల దాడిలో జింక మృతి

బత్తలపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని గంటాపురం పొలాల్లో కుక్కల దాడిలో జింక మృతిచెందినట్లు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ గిరీష్ తెలిపారు. ఆదివారం రాత్రి కుక్కలు జింక పైదాడి చేసి చంపాయని తెలిపారు. సోమవారం ఉదయం పొలం వద్దకు వెళ్తున్న గ్రామస్థుడు తిరుపాలు గమనించి సమాచారం ఇవ్వడంతో ఫారెస్ట్ అధికారి మల్లికార్జున తన సిబ్బంది అయిన గిరీష్, అక్కులప్పను పంపారు. వారు పశువైద్య ఉప సంచాలకులు శ్రీనివాసులుతో వచ్చి, ఏఎస్ఐ సోమశేఖర్ సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం ఆ జింక కళేబరాన్ని దహనం చేశారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

బత్తలపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని రామాపురానికి చెందిన భాస్కర్ నాయుడుకు చెందిన వ్యవసాయ పరికరం దొంగలించిన కేసులో నిందితుడిని సోమవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. భాస్కర్‌నాయుడు రైతు. తన ట్రాక్టర్‌తో వ్యవసాయ పనులకు బాడుగకు వెళ్లే వాడు. ఆయన రూ. 1,47,000 వెచ్చించి తన ట్రాక్టర్‌కు రోటావేటర్‌ను తెచ్చి ఇంటి ఎదుట ఉంచాడు. గత నెల 27తేదీన గుర్తు తెలియని వ్యక్తులు దానిని అపహరించారు. భాస్కర్‌నాయుడు అదే రోజు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. అదే గ్రామానికి చెందిన సంజీవరాయుడు చెడు అలవాట్లకు బానిసై రొటావేటర్‌ను దొంగలించి సంజీవపురం లోని ఓ తోటవద్ద దాచాడు. దానిని విక్రయించేందుకు సోమవారం వెళ్తుండగా పోలీసులు ముస్టూరు క్రాస్ వద్ద అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమవలో ఏఎస్ఐ నాగప్రసన్న, సిబ్బంది నల్లప్ప, నరేష్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'మరిన్ని విజయాలు సాధించాలి'


విజేత జట్టుతో కళాశాల మేనేజింగ్ ట్రస్టీ, అధ్యాపక బృందం

పుట్టపర్తి రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో మరింత విశేషంగా రాణించి మరిన్ని విజయాలు సాధించి మంగళకర డిగ్రీ కళాశాలకు మంచిపేరు తీసుకరావాలని మంగళకర విద్యా సంస్థల మేనేజింగ్ ట్రస్టీ సురేష్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ అంతర కళాశాలల పురుషుల క్రీడాపోటీల్లో భాగంగా గుంతకల్లులోని ఎస్ఎస్ఎస్‌జీ డిగ్రీ కళాశాలలో ఈనెల 6, 7, 8 తేదీల్లో జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో మంగళకర కళాశాల జట్టు పాల్గొంది. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి అనంతపురం ఆర్ట్స్ కళాశాల జట్టుపై గెలు పొంది విన్నర్స్‌గా నిలిచిన తమ కళాశాల విద్యార్థులను ఆయన సోమవారం అభినందించారు. ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆర్యప్రకాష్, ఏఓ జయచంద్రారెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, పీడీ శ్రీనివాసులు, అధ్యాపకబృందం పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న కార్యాలయాలు

● వర్షం వస్తే నీరు కారుతున్న గదులు

● ఆందోళన వ్యక్తంచేస్తున్న ప్రజలు


ఎన్పీకుంట తహసీల్దార్ కార్యాలయంలో పెచ్చులూడిన పైకప్పు


కూలిన ప్రహరీ

నంబులపూలకుంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వర్షం వస్తే చాలు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పరిస్థితే మారిపోతుంది. ఏగదిలో చూసినా వర్షపు నీరు కారుతోంది. ఇలా అయితే కార్యాలయంలో రికార్డులను ఎలా భద్రపరుస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే మండలంలో ఏడువేల ఎకరాలను సోలార్‌కు ఇచ్చారని, సోలార్ ద్వారా వచ్చే సీఎస్ఆర్ నిధులతో నూతనంగా తహసీల్దార్‌భవనం నిర్మించాలని ప్రజ లు కోరుతున్నారు. రూ.9కోట్లుపైగా సీఎస్ఆర్ నిధులున్నాయని, శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల మరమ్మతులు చేయడంతో పాటు అవసరమైన వాటిని నూతనంగా నిర్మించాలని పార్టీలు, సంఘాల నాయకులు కోరుతున్నారు. అదేవిధంగా వరదనీటి ఉధృతికి తహసీల్దార్ కార్యాలయం వెనుక భాగంలో ప్రహరీ గోడ పూర్తిగా కూలిపోయింది. దీంతో కార్యాలయం ఆవరణంలో పశువులు, విషసర్పాలు సంచారం ఎక్కువగా ఉంటోందని కార్యాలయంలోకి ప్రజలు వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నట్లు ప్రజలు వాపోతన్నారు. రికార్డులు భద్రపరిచిన గదిలోకి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని ప్రజలంటున్నారు. దీనిపై తహసీల్దార్ దేవేంద్రనాయక్ వివరణ వివరణ కోరగా.. కార్యాలయం దుస్థితి ఏపీ సోలార్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. సీఎస్ఆర్ నిధులతో భవనం మరమ్మతులు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు.

● నల్లచెరువు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పైకప్పు పెచ్చులు ఊడి కిందకు పడుతున్నాయి. పురాతన భవనం కావడంతో తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో పాటు ప్రతి సోమవారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గ్రీవెన్స్‌కు వచ్చే అధికారులు, తమ సమస్యలు పరిష్కారం కోసం వచ్చే రైతులు పెచ్చులు ఊడుతున్న పైకప్పు చూసి ఎప్పుడు మీద పడుతుందో అని భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ కార్యాలయంలో కనీసం మరమ్మతులకు కూడా చేయలేదు. ఇప్పటికైనా యంత్రాంగం చర్యలు చేపట్టాలని కార్యాలయానికి వచ్చే ప్రజలు, అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



పెచ్చులూడిన నల్లచెరువు కార్యాలయం

జిల్లేడుబండ ప్రాజెక్టు సమస్యలపై మంత్రికి వినతి


మంత్రి నిమ్మలకు వినతి పత్రం ఇస్తున్న ముంపు బాధితులు

ముదిగుబ్బ, నవంబరు10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుడ్డంపల్లితండా సమీపంలో నిర్మిస్తున్న జిల్లేడుబండ ప్రాజెక్టు సమస్యలను రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు విన్నవించినట్లు పొడరాళ్లపల్లి సర్పంచ్ నాగభూషణం, నాయకులు రమణారెడ్డి, రాఘవ తదితరులు తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నీటి పారుదల శాఖ మంత్రిని కలిసి వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. పొడరాళ్లపల్లి ముంపు సమస్య, భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం, పునరావాసం సమస్యల పరిష్కారంపై మంత్రి నిమ్మల సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

డుమ్మా అధికారులపై ఫిర్యాదు: తహసీల్దార్

ఓబుళదేవరచెరువు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు (గ్రీవెన్స్) హాజరుకాని అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రతి సోమవారం కొంత మంది అధికారులు రాకపోగా, మరి కొంత మంది చుట్టపు చూపుగా వచ్చి సంతకాలు పెట్టి వెళ్ళిపోతున్నట్లు ఆరోపణలు వచ్చాయన్నారు.. సోమవారం జరిగిన ప్రజా పరిష్కార వేదికలో పలు శాఖల అధికారులు హాజరుకాలేదని తహసీల్దార్ తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

నంబులపూలకుంట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని వడ్డిపల్లికి చెందిన రైతు సోమశేఖర్ గత నెలలో ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సోమవారం మృతుడి కుటుంబానికి రూ.50వేలు ఆర్థికసాయం అందజేసినట్లు టీడీపీ నాయకులు గంగిరెడ్డి, నగేష్, వెంకటయ్య తెలిపారు. ఆ సొమ్మును మృతుడి కుటుంబ సభ్యులకు అందచేశామన్నారు. మృతుడు అప్పుల బాధతాళలేక ఆత్మహత్య చేసుకున్నాడని, ఈవిషయాన్ని ఎమ్మెల్యేకి వివరించగా, తన వంతుగా ఆయన సాయం చేసినట్లు వారు తెలిపారు.

రైతులు ఇష్టపూర్వకంగా ఇస్తేనే భూములు తీసుకోవాలి

నంబులపూలకుంట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంకమద్ది, ధనియాన్ చెరువు, వెలిచెలమల, మరికొమ్మెదిన్నె పంచాయతీల్లో సోలార్ ఏర్పాటుకు సర్వే చేపడుతున్నారని సీపీఎం, రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. సోలార్‌కు రైతులు భూములను ఇష్టపూర్వకంగా ఇస్తేనే తీసుకోవాలని, ఎవరినీ బలవంత పెట్టకూడదని సోమవారం తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు వినతిపత్రం అందచేశారు. రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దర్గాకు డీఎస్పీ విరాళం


దర్గాకు విరాళం ఇస్తున్న డీఎస్పీ మురళీనాయక్

కదిరి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తలుపుల మండల కేంద్రంలోని బాబాషర్ఫోద్దీన్ దర్గాకు పులివెందుల డీఎస్పీ మురళి సోమవారం రూ.10వేలు విరాళం అందచేసినట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే వంద బస్తాల సిమెంటు కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఫ్రెండ్స్ రూరల్‌డెవలంప్‌మెంట్ ట్రస్టు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో దర్గా మత పెద్దలు, ట్రస్ట్ ప్రతినిధి మన్సూర్, ప్రభువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

'చేనేత కార్మికుల ఏళ్ల కల సాకారం'


సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ధర్మవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని చేనేత కార్మికుల ఎన్నో ఏళ్ల కల నేడు సాకారమైందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు తెలిపారు. మెగా హ్యాండ్ లూమ్ క్లస్టర్‌కు భూమి కేటాయింపు కోసం రాష్ట్ర క్యాబినేట్ ఆమోదం తెలపడంతో సోమవారం స్థానిక కదిరిగేటు వద్ద ఉన్న నేతన్న విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం అక్కడే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి సత్యకుమార్‌యాదవ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హ్యాండ్‌లూమ్ క్లస్టర్‌కు భూమి కేటాయింపు చరిత్రాత్మక నిర్ణయమన్నారు. ఇందుకు రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవ చూపారన్నారు. 2024 ఎన్నికల ప్రచార సమయంలో మంత్రి ఇచ్చిన హామీని నిల బెట్టుకున్నారన్నారు. బీజేపీ నాయకులు జింకాచంద్రశేఖర్, గొట్లూరు చంద్ర, గుండాపుల్లయ్య, డోలా రాజారెడ్డి, పోతుకుంటరాజు, బిల్లేశీన, జనసేన నాయకులు అడ్డగిరి శ్యాంకుమార్, రాజారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి వీధి పరిశుభ్రంగా ఉండాలి

ధర్మవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ప్రతి వార్డులో వీధులన్నీ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు అన్నారు. పట్టణంలో పరిశుభ్రత, నీటి సరఫరాపై ఆయన సోమవారం ఎన్డీఏ స్థానికకార్యాలయంలో మున్సిపాలిటీ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పట్టణంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చెత్తాచెదారం, డ్రైనేజీ వ్యవస్థలను పూర్తిగా శుభ్ర పరచాలని సూచించారు. నీటి సరఫరా నిరాటంకంగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

సీసీరోడ్ల ఏర్పాటు కోసం మంత్రికి వినతి

ధర్మవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాలలో సీసీరోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటుచేయాలని టీడీపీ నాయకుడు కొత్తపేట ఆది రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకు మార్‌యాదవ్‌కు వినతి పత్రం అందజేశారు. విజయవాడలోని మంత్రి సత్యకు మార్ యాదవ్‌ను సోమవారం కలిసి సమస్యను విన్నవించినట్లు ఆయన తెలిపారు. ప్రధానంగా పట్టణంలోని పార్థసారథినగర్, కొత్తపేట, మారుతీనగర్, తారాక రామాపురం, గుట్టకిందపల్లి ప్రాంతాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి విన్నవించినట్లు ఆయన తెలిపారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్టు కొత్తపేట ఆది తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● ఇద్దరికి స్వల్పగాయాలు

ముదిగుబ్బ, నవంబరు, 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బైపాస్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి స్వల్ప గాయాలైనట్లు ముదిగుబ్బ సీఐ శివరాముడు పేర్కొన్నారు. కడపజిల్లా పులివెందులకు చెందిన గౌస్‌పీరా(48) అనం తపురం నుంచి తన కూతురు మసూరత్ జహాతో కలిసి ద్విచక్ర వాహ నంలో పులివెందులకు వెళుతున్నాడు. ముదిగుబ్బ బైపాస్ రోడ్డులోకి రా గానే కదిరి వైపు నుంచి వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. గౌస్‌పీరా తలకు తీవ్ర గాయాలు కాగా, గౌస్‌పీరా కూతురుకు, కారులో ఉన్న మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. గౌస్‌పీరాను ఓ ప్రైవేట్ వా హనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మృతుడు పులివెందులలో హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డును తవ్వేశారని ఫిర్యాదు

కొత్తచెరువు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరి ధిలోని కేశాపురం గ్రామానికి వెళ్లే బ్రిడ్జి సమీపంలో రోడ్డును వెంకటలక్ష్మమ్మ అనే మహిళ తవ్వేశారంటూ గ్రామస్థులు సోమవారం తహసీల్దార్ బాలాంజినేయులుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ధర్మవరం ప్రధానరహదారి నుంచి కేశాపురానికి వెళ్లేందుకు మాజీ మంత్రి పల్లెరఘునాథ రెడ్డి ఆయన మంత్రిగా ఉన్నప్పుడు దాదాపు రూ.8 కోట్లతో చిత్రావతి నదిపై బ్రిడ్జితో పాటు తారురోడ్డును వేయించారు. దీంతో ఎన్నో ఏళ్లగా ఉన్న రహదారి సమస్య పరిష్కారమైంది. అయితే తారు రోడ్డు నిర్మాణానికి తన భూమి పోయిందని, నష్టపరిహారం ఇవ్వలేదన్న కారణంతో రోడ్డును వెంకటలక్ష్మమ్మ తవ్వేశారని గ్రామస్థులు తెలిపారు. ఆ భూమి వంకపోరంబోకు కావడంతో ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వలేదన్నారు. గ్రామంలోకి వెళ్లే బ్రిడ్జి మలుపువద్ద రోడ్డును తవ్వేయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు తహసీ ల్దార్‌ను కోరారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఆయన వీఆర్వో, ఆర్ఐ, మండల సర్వేయర్‌ను ఆదేశించారని గ్రామస్థులు తెలిపారు.


కేశాపురం బ్రిడ్జి సమీపంలో రోడ్డును తవ్వేసిన దృశ్యం

యువకుడి అరెస్ట్

కదిరి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ గురుకుల పాఠశాలలోకి అక్రమంగా ప్రవేశించిన యువకుడిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి సోమవారం ఓప్రకటనలో తెలిపారు. ఈనెల 7న కుమ్మరోళ్లపల్లికి చెందిన మహేష్ అనే యువకుడు అక్రమంగా పాఠశాలలోకి ప్రవేశించాడు. దీన్ని గుర్తించిన సెక్యూరిటీగార్డు ఉమాదేవి పట్టుకోవడానికి ప్రయత్నించగా, అతడు కత్తితో బెదిరించి పారిపోయాడు. దీనిపై పాఠశాల యజమాన్యం ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేశారు. సోమవారం ఉదయం మహేష్‌ను కుమ్మరోళ్లపల్లి శివార్లలో అరెస్టు చేసినట్లు తెలిపారు. కోర్టుకు తరలించగా, 14రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ వివరించారు.

నేడు టీడీపీ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

కదిరి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని టీడీపీ మండల, క్లస్టర్, యూనిట్, విలేజీ, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఓప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని పీవీఆర్ గ్రాండ్‌లో ఉదయం 9గంటలకు ప్రమాణ స్వీకారోత్సవం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆ ప్రకటనలో కోరారు.

ఘనంగా అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠ


అలంకరణలో మూలవిరాట్

గాండ్లపెంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చిన్నమిట్ట వద్ద నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తెల్లవారుజామున 2 గంటల నుంచి నేత్రోన్మీలనం, మహా పూర్ణాహుతి, నెయ్యి అభిషేకం, మహా కుంభాభిషేకం తదితర పూజా కార్యక్రమాలను వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య ప్రతిష్ఠా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. దుశ్శాలువ కప్పి సత్కరించారు. అయ్యప్పస్వామి చిత్రపటాన్ని బహూకరించి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం అయ్యప్ప మహాపడి పూజ, భజనలు, వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్ఐ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.


ఎమ్మెల్యేకి స్వామి చిత్రపటం అందజేస్తున్న నిర్వాహకులు

హమాలీ యూనియన్ సభను విజయవంతం చేయండి : సీఐటీయూ

ముదిగుబ్బ, నవంబరు, 10(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో మంగళవారం నిర్వహించే హమాలీ యూనియన్ మహాసభను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు జి. ఓబులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మంగళవారం జరగనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ హమాలీ యూనియన్ మహాసభను విజయవంతం చేయాలన్నారు. హమాలీల పలు డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. సీపీఎం నాయకులు ఆటో పెద్దన్న, ఆవాజ్ కమిటీ నాయకులు బాబ్జాన్, ఫక్కీరప్ప, హమాలీ యూనియన్ నాయకులు సూరి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థిని


ఎంపికైన విద్యార్థిని సింధును అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం, కోచ్

ధర్మవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కురాషా పోటీల్లో ధర్మవరం విద్యార్థిని సింధు ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు జీవీఈ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుమన తెలిపారు. ఇటీవల అనంత పురం సమీపంలోని మాంటి స్సోరి పాఠశాలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కురాషా పోటీల్లో తమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న సింధు పాల్గొన్నాడన్నారు. అండర్-14 మైనస్ 32 కేజీ విభాగంలో ప్రతిభను కనబరచి బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. ఆ విద్యార్థిని ఉత్తరప్రదేశ్‌లో డిసెంబరు 15 నుంచి 18వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం తమ పాఠశాలకు గర్వకారణ మన్నారు. దీంతో ఆ విద్యార్థినిని హెచ్‌ఎంతో పాటు పీఈటీ స్వరూప, సరళ, కోచ్‌లు ఇనాయాత్‌బాషా, నవ్యశ్రీ అభినందించారు.

నారాయణ సేవ ప్రారంభం

కొత్తచెరువు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రానికి చెందిన కాంట్రాక్టర్ సీవీ శ్రీనివాస్ చౌదరి సత్యసాయి భజన మందిరం ఆధ్వర్యంలో సోమవారం నారాయణ సేవ ప్రారంభించారు. మొదట బాబా చిత్రపటానికి పూజలు చేశారు. భక్తి పాటలు ఆలపిం చారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీలో గర్భిణులకు, రోగులకు అన్నదానం చేశారు. బాబా భక్తులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



లేపాక్షి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం దుర్గావీరభద్రస్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు నర్సింహశర్మ, శ్రీనివాసరావు.. దుర్గావీరభద్రస్వాములకు పూలతో అలంకరించి అభిషేకాలు, అర్చనలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తీక పూజలు: కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని శివాలయాల్లో మహిళలు, భక్తులు పూజలు నిర్వహించారు. మూడో సోమవారం శివాలయాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. మహిళలు ఉపవాస దీక్షలు చేపట్టి దీపాలు వెలిగించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.



పెనుకొండ(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని స్థానిక కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు.



అగళి: మండల కేంద్రంలోని శంకరేశ్వరస్వామికి రుద్రాభిషేకం సోమవారం ఘనంగా నిర్వహించారు. పండితులు నిమ్మకాయ, దోసకాయ, కొబ్బరినీళ్లు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. ముందుగా గణపతిపూజ నిర్వహించిన అనంతరం పూజలు నిర్వహించి బిల్వ పత్రాలు, పూలతో స్వామిని అలంకరించారు. మహిళలు పెద్దఎత్తున హాజరై కార్తీక దీపాలను వెలిగించారు.



స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

మడకశిరటౌన్(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చంద్రమౌళీశ్వరస్వామి, మిట్టబండ ఆంజనేయస్వామి, అభయాంజనేయస్వామి, కోట వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో కార్తీకమాస సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్లను రంగు రంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కుబడులను తీర్చుకొన్నారు. స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. షిర్డీసాయి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి ఆకు పూజ, అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా పాలుపోసే పండగ



పూజల్లో పాల్గొన్న భక్తులు

రొళ్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లహట్టి గ్రామంలో సోమవారం యాదవులు పాలుపోసే పండగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ప్రజలు వేంకటేశ్వరస్వామి, బాలకృష్ణ, ఈరప్ప స్వాములు త్రిమూర్తులకు దీపారాధన చేసిన పాలుపోశారు. కార్యక్రమానికి టీడీపీ మండల కన్వీనర్ ఈరన్న హాజరయ్యారు.

భక్తులకు అన్నదానం



తిరుమల పాదయాత్రికులకు భోజనం వడ్డిస్తున్న ఫరీద్‌బాబా

చిలమత్తూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుమలకు పాదయాత్రగా వెళ్లే భక్తులకు సోమవారం రాత్రి కొడికొండకు చెందిన టీడీపీ నాయకుడు ఫరీద్ బాబా కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. మడకశిర, అమరాపురం మండలాల నుంచి పాదయాత్ర ద్వారా 200 మంది కాలినడకన తిరుమలకు వెళుతున్నారు. ముందస్తు సమాచారంతో ఫరీద్ కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వారిని సన్మానించారు. వారికి భోజనాలను స్వయంగా వడ్డించి పెట్టారు.

ఆర్థిక సాయం



బాలిక తండ్రికి ఆర్థిక సాయం అందిస్తున్న కమిటీ సభ్యులు

గోరంట్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ వీధిలో నివాసముంటున్న బాలిక జైబా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండగా జమియత్ ఉల్మా కమిటీ సభ్యులు రూ.15వేలు ఆర్థికసాయం సోమవారం అందించారు. ఆర్ఫీ కుమార్తె జైబాకు కిడ్నీ శస్త్ర చికిత్స చేయించగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. జమియత్ ఉల్మా కమిటీ గుర్తించి బాలిక తండ్రికి నగదు అందించారు. మౌలానా షఫీవుల్లా, మౌలానా అబ్దుల్లా, హబీబ్‌జావీద్, మౌలానా ముజీద్, ముక్తియార్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే



సీఎం సహాయ నిధి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 58 మంది లబ్ధిదారులకు రూ.18.53లక్షల విలువచేసే సీఎం సహాయ నిధి చెక్కులను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తూతూమంత్రంగా అరకొర సంక్షేమ పథకాలు ఇచ్చి ప్రచారం మాత్రం జగన్ ఊదరగొట్టారని మండిపడ్డారు. ఓ వైపు పేదల ప్రభుత్వం అని చెబుతూనే వారికి అందాల్సిన సంక్షేమ పథకాల మాటున దోపిడీకి తెరతీసిన ఘనుడు జగన్‌మోహన్‌రెడ్డికాదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు సారథ్యంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు, డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, కన్వీనర్లు తిప్పేస్వామి, నాగరాజు, లక్ష్మీనరసప్ప పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సమష్టి కృషి: గ్రామాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బసవనపల్లి, నరసాంబుది, గౌడనహళ్లి గ్రామ పంచాయతీల పరిధిలోని నాయకులు, కార్యకర్తలతో విడివిడిగా సమావేశమయ్యారు. పంచాయతీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పంచాయతీల అభివృద్ధికి ఎలాంటి కార్యక్రమాలు చేపడితే అభివృద్ధి చెందుతాయన్న విషయాలపై అభిప్రాయాలు తెలుసుకొన్నారు. దేశానికి గ్రామ పంచాయతీలే పట్టుకొమ్మలని, వాటి అభివృద్ధికి అందరూ కృషి చేయాలన్నారు. పార్టీ అభ్యున్నతి, గ్రామ స్థాయిలో నాయకులు, కార్యకర్తల మధ్య దూరం ఉందా అన్న అభిప్రాయాలను తెలుసుకొన్నారు. ఎలాంటి సమస్య ఎదురైనా నేరుగా వచ్చి కలిసి తెలపాలని సూచించారు. మండల కన్వీనర్లు నాగరాజు, తిప్పేస్వామి, కృష్ణమూర్తి, మాజీ సర్పంచి చంద్రప్ప పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయించండి: ఎస్టీయూ

సోమందేపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలని ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్ కోరారు. సోమవారం మండలంలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులచే ఎస్టీయూ సభ్యత్వాన్ని నమోదు చేయించారు. అనంతరం వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలన్నారు. నూతన పీఆర్సీ కమిటీని ఏర్పాటుచేసి 30శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయులు తమదృష్టికి తెచ్చిన సమస్యలను రాష్ట్రనాయకుల దృష్టికితీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

అదనపు లోడ్ క్రమబద్ధీకరణను వినియోగించుకోండి

చిలమత్తూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ వినియోగదారులు తక్కువ లోడ్ తీసుకొని అధిక లోడ్ వినియోగిస్తుంటే, వెంటనే క్రమబద్ధీకరణకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ జయవర్ధన్‌రెడ్డి సూచించారు. అధిక లోడ్ క్రమబద్ధీకరణకు ప్రభుత్వం వాలంటరీ అడిషనల్ లోడ్ స్కీమ్‌ను ప్రవేశపెట్టిందన్నారు. 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించిందన్నారు. డిసెంబరు 31లోగా క్రమబద్ధీకరణ చేసుకోవాలని సూచించారు.

నేడు సర్వసభ్య సమావేశం

అమరాపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ భవనంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు. ఏపీఎంసీ మార్కెట్ డైరెక్టర్ గురుమూర్తి, మండల ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు గణేష్ పాల్గొంటారన్నారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక పాల్గొనాలన్నారు.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

హిందూపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లై హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో అనంతపురంలో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకుడు రాము పిలుపునిచ్చారు. సోమవారం బియ్యం గోడౌన్‌వద్ద కరపత్రాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న కార్మికులను నాలుగోతరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. నాయకులు యర్రిస్వామి, ప్రసాద్, మురళి, నాగరాజు, రామాంజి, నాగార్జున పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలు సక్రమంగా నిర్వహించాలి



మహిళా సంఘాల సభ్యులతో సమావేశమైన ఏపీఎం రామేశ్వర్‌రెడ్డి

పరిగి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా డ్వాక్రా సంఘాలు సక్రమంగా నిర్వహించాలని మోదా గ్రామంలో ఏపీఎం రామేశ్వర్‌రెడ్డి సంఘాల సభ్యులకు సూచించారు. సోమవారం ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. మహిళలకు డ్వాక్రా సంఘాలు ఏర్పాటుచేసి రుణం రూపంలో నగదు అందిస్తే వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని, తిరిగి కంతులు చెల్లిస్తే మరొకరికి ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

సోమందేపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హంద్రీనీవా కాలువగట్టుపై నుంచి ద్విచక్రవాహనంలో వస్తున్న కుమార్, నంద, నవాజ్ వాహనం అదుపుతప్పి కాలువలోపడిన ఘటనలో గాయపడినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వారిని కాలువనుంచి బయటికి తీసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఒకరిని బెంగళూరుకు, మరొకరిని కర్నూలు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఈ ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై పోలీసులను వివరణ అడగ్గా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు. యువకులు మత్తులో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

సరిహద్దు రాళ్ల ధ్వంసం

రొద్దం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రొద్దకంపల్లి రెవెన్యూ పరిధిలోని రామలింగప్ప పొలానికి వేసిన 30 సరిహద్దు రాళ్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఆదివారం రాత్రి రొద్దంకపల్లి గ్రామ సమీపంలో ఉన్న రియల్‌ఎస్టేట్ వ్యాపారి రామలింగకు చెందిన సరిహద్దురాళ్లు ఉద్దేశ్యపూర్వకంగా ధ్వంసం చేశారు. చాలా రోజులుగా ఆయనకు ఇతరులకు గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే రాళ్లు ధ్వంసం చేశారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బాధితుడు ఎస్ఐ వీరాంజనేయులకు ఫిర్యాదు చేశారు.

విగ్రహ ఏర్పాటుకు విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న వెంకటశివారెడ్డి

గోరంట్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హిందూపురం రహదారి పక్కన యోగివేమన విగ్రహ ప్రతిష్ఠకు నార్సంపల్లి రామలింగారెడ్డి రూ.1.50 లక్షలు విరాళాన్ని సోమవారం ఆలయ నిర్వాహకులకు అందించారు. రాజకీయాలకు అతీతంగా మంత్రి సవిత సహకారంతో యోగివేమన విగ్రహ ఆవిష్కరణ కోసం గోరంట్లలో ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. రెడ్డి సంఘం నాయకుల అభ్యర్థన మేరకు రామలింగారెడ్డి కుమారుడు వెంకటశివారెడ్డి నగదు అందించారు. అశ్వత్థరెడ్డి, గట్టు చంద్రశేఖర్‌రెడ్డి, ఖాజారెడ్డి, మురిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నంజిరెడ్డి, వీరనారాయణరెడ్డి పాల్గొన్నారు.

వీల్‌చైర్ పంపిణీ



దివ్యాంగ విద్యార్థికి ఎలక్ట్రిక్ వీల్‌చైర్ అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ రమేష్

హిందూపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సమగ్ర సర్వశిక్ష ఆధ్వర్యంలో భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగ చిన్నారులకు ఎలక్ట్రికల్ మోటార్ వీల్‌చైర్ పంపిణీ చేశారు. సోమవారం పట్టణంలోని భవిత కేంద్రంలో మున్సిపల్ చైర్మన్ రమేష్ ఇంటర్ చదువుతున్న దివ్యాంగ విద్యార్థి అశ్విన్‌కు రూ.50వేలు విలువచేసే మోటారు వీల్‌చైర్ అందించారు. ఎంఈఓ గంగప్ప, టీడీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్, హెచ్ఎం సూర్యనారాయణ, ఉపాధ్యాయులు లలిత, నందిని పాల్గొన్నారు.

కనకదాస విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

రొద్దం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయం పక్కన భక్త కనకదాస విగ్రహ ఏర్పాటుకు కురుబ కులస్థులు భూమిపూజ చేశారు. ఆదివారం రాత్రి పెనుకొండ, పావగడ, రహదారిలో ఉన్న సింగిల్‌విండో కార్యాలయం వద్ద విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. చెన్నకేశవులు, అశ్వత్థనారాయణ, చంద్రమోహన్, రామాంజనేయులు, చంద్రశేఖర్, హరి, హనుమంతు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి..

రొళ్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకి పంచాయతీలో కోడి మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద కమ్యూనిటీ భవనం మంజూరైంది. దీని నిర్మాణానికి సోమవారం స్థానిక టీడీపీ నాయకులు భూమిపూజ చేశారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి, మండల కన్వీనర్ ఈరన్న, సింగిల్‌విండో అధ్యక్షుడు దాసిరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ రామక్రిష్ణ పాల్గొన్నారు.

విలేకరుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా యోగేష్

పావగడ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తుమకూరు జిల్లా విలేకరుల సంఘం అధ్యక్ష, ఉపాధ్య స్థానానికి ఆదివారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా యోగేష్ గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా జయన్న, ప్రధాన కార్యదర్శిగా రఘురాం, కోశాధికారిగా సతీష్, హోరేగెరె గెలుపొందారు. రాష్ట్ర కార్యకారిణి సమితి అధ్యక్షుడిగా పురుషోత్తం హ్యాట్రిక్ విజయం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరి ఎంపిక 2028వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు యోగేష్‌ను సన్మానించారు.

సామూహిక సీమంతాలు



సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ లావణ్య

చిలమత్తూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. 70 మందికి సంప్రదాయ ప్రకారం సీమంతాలు చేశారు. డాక్టర్ లావణ్య, ఆసుపత్రి సిబ్బంది, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు. సీహెచ్ఓ జయచంద్ర కుమార్, ట్రస్టు ప్రతినిధి ఎల్ఐసీ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

రొద్దం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లూరు గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి(71) క్యాన్సర్ వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై వరక్తి చెంది ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రొద్దం ఎస్ఐ వీరాంజనేయులు తెలిపిన మేరకు నల్లూరు గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి అనేక నెలలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ నయం కాక మనస్థాపానికి గురై సోమవారం ఉదయం గ్రామ సమీపంలోని పొలాల్లో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు విషయం తెలుసుకుని బంధువులకు సమాచారం అందించగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ పరిశీలించి కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేపు క్లస్టర్ యూనిట్ సభ్యులతో సమావేశం

హిందూపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్, కో-కన్వీనర్లతో బుధవారం సమావేశం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు తెలిపారు. నూతనంగా ఎంపికైన బూత్ కన్వీనర్, కోకన్వీనర్, గ్రామ వార్డు పదవీ బాధ్యతల ప్రమాణ స్వీకారోత్సవం ఉంటుందన్నారు. ఆర్ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు.

ఇసుక అక్రమ తరలింపును అరికట్టండి

గోరంట్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిపల్లికి చెందిన రైతులు చిత్రావతి నదిలో ఇసుక అక్రమ తరలింపులను అరికట్టాలని తహసీల్దార్ మారుతికి సోమవారం వినపత్రం అందించారు. చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో బోర్లబావులు, బోర్లు వేసుకుని పంటలు పంటలు పండిస్తున్నట్లు రైతులు తెలిపారు. ఇసుక తరలింపు వల్ల పంటలకు అవరోధం ఏర్పడుతుందన్నారు. బూదిలిపి, పాపిరెడ్డిపల్లికి చెందిన ఆరుగురు ట్రాక్టర్ యజమానుల పేర్లు వెల్లడించారు. అక్రమ రవాణాను అరికట్టాలని వారు కోరారు. అలాగే పాలసముద్రం జాతీయ రహదారి కూడలిలోని కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కార్మిక సంఘాల నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. గంగాధర్, స్వర్ణలత, అంజలి, ఆంజనేయులు, ముత్యాలప్ప, చిన్నయ్య, లోకేష్, లక్ష్మి, వెంకటమ్మ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న పాపిరెడ్డిపల్లి రైతులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గీత

పెనుకొండ రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గీత సూచించారు. సోమవారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వ్యవసాయశాఖాధికారులు మాట్లాడుతూ.. మండలంలో ఈక్రాప్ నమోదు వందశాతం పూర్తయిందని, డ్రోన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉపాధిహామీ అధికారులు మాట్లాడుతూ ఉపాధికూలీలకు ఈకేవైసీ చేయిస్తున్నామన్నారు. మండలంలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ పూర్తయినట్లు తెలిపారు. ట్రాన్స్‌కో అధికారులు మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ యోజన దరఖాస్తులు అందరికీ అందుబాటులో ఉన్నాయని కరెంటు బిల్లు 99శాతం తగ్గుతుందన్నారు. ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

రేషన్ మాఫియాను అరికట్టండి: సీపీఎం



తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

సోమందేపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఉన్న రేషన్ షాపుల నుంచి సబ్సిడీ బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలింపును అరికట్టాలని సీపీఎం జిల్లా నాయకుడు పెద్దన్న కోరారు. రెండు చోట్ల డంప్‌లు ఏర్పాటుచేసుకుని టెంపోలు, లారీలలో వాటిని తరలిస్తున్నట్లు ఆరోపించారు. అధికారులకు సమాచారం ఉన్నా చర్యలు తీసుకోవడం లేదన్నారు. మండలంలో ఏర్పాటుచేసిన మద్యం దుకాణదారులు ఎమ్మార్పీ కంటే అధిక ధరలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సంబంధిత శాఖాధికారులు తమకేమిపట్టనట్లు చోద్యం చూస్తున్నారన్నారు. మద్యం అక్రమ విక్రయాలను, రేషన్ మాఫియా అరికట్టాలని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రాన్ని అందించారు. హనుమయ్య, మాబు, కొండా వెంకటేశులు, నాగభూషణం, నాగరాజు, వలీ, ఆనంద్, మసూద్ పాల్గొన్నారు.

జూడోలో విద్యార్థినికి బంగారు పతకం



బంగారు పతకంతో జాహ్నవి

సోమందేపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతినగర్‌కు చెందిన బోయ దాము, దీపల కుమార్తె జాహ్నవి శనివారం కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో బంగారు పతకాన్ని సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దాము చేనేత కార్మికుడిగా పనిచేస్తూ రియల్ వ్యాపారం చేస్తుండగా కుమార్తె జాహ్నవి చదువులో రాణిస్తూ క్రీడల్లో ప్రతిభ కనబరుస్తోంది. 7వ తరగతి నుంచి ఆర్డీటీఓ చదువుకుంటూ మండల స్థాయి నుంచి జిల్లా స్థాయిలో పతకం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. కాకినాడలో నిర్వహించిన జూడో పోటీల్లో బంగారు పతకం సాధించి పుట్టిన ఊరు, తల్లిదండ్రులకు పేరు తీసుకొచ్చింది. మణిపూర్‌లో జరిగే జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి సన్మానం



ఎంబీబీఎస్ విద్యార్థిని సన్మానిస్తున్న బీపీఎస్ కమిటీ సభ్యులు

పావగడ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన విద్యార్థి గంగాధర్‌ను భారతీయ పరివర్తన సంఘం (బీపీఎస్) సభ్యులు సోమవారం సన్మానించారు. పట్టణంలోని అదర్శనగర్ అంబేడ్కర్ భవనంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ హరిరామ్ మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న ప్రతిభను గుర్తించి వారి తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఉన్నత విద్యకోసం సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. పేద కుటుంబాల ఆర్థిక చైతన్యవంతంలేక ఇబ్బంది పడుతున్నవారి కష్టాలను అధిగమించి పిల్లల విద్యకోసం త్వరలో మార్పుకోసం విద్యార్థులు, యువత కృషిచేయాలని దేవనహళ్లి హరీష్ సూచించారు. జిల్లా అధ్యక్షుడు కెంచారాయ, తాలూకా అధ్యక్షుడు ఈరన్న, లాయర్ రఘునందన్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మురుగు కాలువ పరిశీలన



మురుగు కాలువను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ

సోమందేపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డీఎల్‌రోడ్డులో ఉన్న మురుగు కాలువలను డిప్యూటీ ఎంపీడీఓ ప్రేమ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ఆక్రమణల తొలగింపు తోసరి మురుగు కాలువల మరమ్మతులేది అన్న కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. నాయకులు నీరుగంటి చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేష్‌రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్ కింద మండలానికి రూ.1.50కోట్లు మంజూరైనట్లు తెలిపారు. అందులో మురుగునీటి శుద్ధి కర్మాగారానికి రూ.1.10కోట్లు కేటాయించగా మిగిలిన నిధులు రూ.40లక్షలతో డ్రైనేజీల మరమ్మతులు, నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా డీఎల్‌రోడ్డులో మురుగు కాలువలను శుభ్రంచేసి మరమ్మతులు చేపట్టామన్నారు. నాయకులు శరత్‌చంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.